PCW
తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd
Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna
హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 75 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- శుక్రవారం 13 మార్చి 2026

## సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం



3లో

## వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ 16వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



3లో



# PCW తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd

Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 75 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- శుక్రవారం 13 మార్చి 2026


**సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం**




**వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ 16వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు**




## యుద్ధ డిమాండ్లను అంగీకరించాల్సిందే...

- అప్పుడే యుద్ధ విరమణకు అంగీకరిస్తాం
- ఇరాన్ విషయంలో దుందుడుకు చర్యలు అంగీకరించం
- ప్రపంచానికి తేల్చిచెప్పిన ఇరాన్ నాయకత్వం
- పరస్పరదాడులతో కొనసాగుతున్న ఉద్రిక్తతలు
- రెండు ట్యాంకర్లపై 'సూసైడ్ బోటు'తో దాడి
- మరిన్ని దాడులు చేస్తామంటూ ట్రంప్ హెచ్చరికలు




## హోర్ముజ్ జలసంధి మూసే ఉంచుతాం

- అమెరికాపై ప్రతీకార దాడులు ఆగవు
- పొరుగుదేశాలు అమెరికా స్థావరాలు మూసేయాలి
- ఇరాన్ కొత్తనేత మొజ్తబా ఖమేనీ తొలి ప్రకటన
- ప్రసారం చేసిన ఇరాన్ టెలివిజన్




## యుద్ధ సంక్షోభంలో భారత్ తొలి విజయం

- హర్మూజ్ జలసంధి నుంచి భారత్‌కు చమురు నౌక
- క్షేమంగా ముంబై తీరం చేరుకున్నషెన్‌లాంగ్
- ఇరాన్ పరోక్ష మద్దతుతో తొలి నౌక రాక




## త్రీ ట్రిలియన్ డాలర్ ఎకానమీ సాధనలో పోలీస్ శాఖ పాత్ర కీలకం

- పోలీస్ శాఖలో దశలవారీగా ఎలక్ట్రిక్ వాహనాలు వినియోగం
- రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కి రూరల్ అగ్రి రీజియన్ పై దృష్టి
- ప్రీ బడ్జెట్ సమావేశాల్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**హైదరాబాద్,మార్చి 12 (పిసిడబ్ల్యూ న్యూస్):** 2047 నాటికి త్రీ ట్రిలియన్ డాలర్ ఎకానమీ సాధించడమే లక్ష్యంగా రాష్ట్రం ముందుకు పోతున్న క్రమంలో ఈ లక్ష్యసాధనలో పోలీస్ శాఖ పాత్ర కీలకమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. గురువారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో మొదట హోంశాఖ తదుపరి మంత్రి దుదిల్ల శ్రీధర్ బాబుతో కలిసి పరిశ్రమలు, ఐటీ శాఖల ప్రీ బడ్జెట్ సమావేశంలో డిప్యూటీ సీఎం పలు సూచనలు చేశారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పెద్ద సంఖ్యలో పెట్టుబడిదారులు వస్తున్న నేపథ్యంలో శాంతిభద్రతలు కీలకం అన్నారు. ఈ అంశంలో ఏ చిన్న పొరపాటుకు హోంశాఖ అధికారులు, సిబ్బంది అవకాశం ఇవ్వరాదని, ప్రతి కదలిక మీ కనుసన్నల్లో ఉండాలని సూచించారు. విధుల నిర్వహణ క్రమంలో హోంశాఖకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు. హైదరాబాద్ నగరం ప్రపంచంలో మేటి నగరంగా ఎదుగుతున్న క్రమంలో వేగంగా పలు సంస్కరణలు చేపడుతున్నామని ఇందులో భాగంగా పోలీస్ మిగతా2లో...

## యాదాద్రీశుడిని దర్శించుకున్న గవర్నర్



- గవర్నర్ శుక్లా దంపతులకు ఘన స్వాగతం
- దర్శనం చేయించి, వేదాశీర్వచనం ఇచ్చిన పండితులు

**యాదాద్రి,మార్చి 12 (పిసిడబ్ల్యూ న్యూస్):** యాదగిరిగుట్టలో కొలువైన శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని తెలంగాణ నూతన గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా దర్శించుకున్నారు. శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దర్శనం కోసం గురువారం ఉదయం యాదగిరిగుట్టకు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాతోపాటు ఆయన కుటుంబ సభ్యులు చేరుకున్నారు. మిగతా2లో...



## స్పీకర్ నిర్ణయమే ఫైనల్..

- బిఆర్ఎస్ ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు క్లోజ్
- స్పీకర్ నిర్ణయంతో ఏకీభవించిన సుప్రీం
- తదుపరి విచారణ అవసరం లేదని వ్యాఖ్య

**న్యూఢిల్లీ,మార్చి 12 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపు కేసు విచారణ ఎట్టకేలకు ముగిసింది. రాష్ట్ర రాజకీయాల్లో కొన్నిరోజులుగా తీవ్ర కలకలం రేపిన ఈ కేసు విచారణను గురువారం నాడు సుప్రీంకోర్టు ముగించింది.

మిగతా2లో...

## తెలుగు రాష్ట్రాలకు ఎండల నుంచి రిలీఫ్..

- తెలంగాణ, ఏపీకి వర్ష సూచన




## హైదరాబాద్‌లో నెట్‌ఫ్లిక్స్ స్టూడియో

**ప్రారంభించిన సిఎం రేవంత్ రెడ్డి**



**హైదరాబాద్,మార్చి 12 (పిసిడబ్ల్యూ న్యూస్):** నెట్‌ఫ్లిక్స్‌ను హైదరాబాద్‌కు ఆహ్వానిస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్ అన్ని అవకాశాలను కల్పిస్తుందని, తమ ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని చెప్పారు. హైటెక్‌సిటీలోని నెట్‌ఫ్లిక్స్‌కు చెందిన ఐలైన్ స్టూడియోస్ కార్యాలయాన్ని సీఎం రేవంత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మిగతా2లో...

## 14 నుంచి పదోతరగతి పరీక్షలు

- అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- సకాలంలో సెంటర్లకు చేరుకోవాలని సూచన
- ఐదు నిముషాల ఆలస్యానికి అనుమతి



**హైదరాబాద్,మార్చి 12 (పిసిడబ్ల్యూ న్యూస్):** పదో తరగతి వార్షిక పరీక్షలు ఈ నెల 14 నుంచి ప్రారంభంకానున్నాయి. ఈ మేరకు అధికారులు సకల ఏర్పాట్లు పూర్తి చేశారు. పరీక్షలు శనివారం ప్రారంభమై.. ఏప్రిల్ 16వ తేదీ వరకు జరుగుతాయి. ఉదయం 9.30 గంటలకు పరీక్షలు ప్రారంభం అవుతాయి. సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచించారు. అయితే పరీక్షలకు ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చే విద్యార్థులను అనుమతిస్తారు. ఆ తర్వాత వచ్చే వారిని అస్సలు అనుమతించబోరు. అంటే ఉదయం 9:35 గంటల తర్వాత వచ్చే విద్యార్థులను పరీక్షకు అనుమతించబోరు. విద్యార్థులు మిగతా2లో...

## 16 నుంచి ఒంటిపూట బడులు

- ఉత్తర్వులు జారీచేసిన విద్యాశాఖ




**హైదరాబాద్,మార్చి 12 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్రంలో ఎండల తీవ్రత దృష్ట్యా పాఠశాల విద్యాశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు మార్చి 16 నుంచి ఏప్రిల్ 23 వరకు ఒంటిపూట బడులు నిర్వహించనున్నట్లు అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ప్రతిరోజూ ఉదయం 8:00 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు తరగతులు జరుగు తాయి. ప్రభుత్వ పాఠశాలల్లో

మిగతా2లో...

## తెలంగాణలో కమర్షియల్ సిలిండర్ల కొరత

- నేడు చమురు కంపెనీలతో ప్రభుత్వం చర్చలు
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి



**హైదరాబాద్,మార్చి 12 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణలో కమర్షియల్ సిలిండర్ల కొరత వాస్తవమేనని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం హైదరాబాద్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో నిత్యం సరఫరా అవుతున్న వంట గ్యాస్ సిలిండర్లలో దాదాపు 86 శాతం డొమెస్టిక్ కనెక్షన్లేనని ఆయన స్పష్టం చేశారు. అలాగే మిగిలిన 14 శాతం మాత్రమే కమర్షియల్ అని వివరించారు. ప్రస్తుతానికి డొమెస్టిక్ సిలిండర్ల సరఫరాలో ఎలాంటి కొరత లేదని తమ శాఖ అధికారులు వెల్లడించారని చెప్పారు. కానీ కమర్షియల్ సిలిండర్ల సరఫరాలో మాత్రం కొన్ని ఇబ్బందులు ఉన్నాయన్నది వాస్తవమని తెలిపారు. రాష్ట్రంలో వంట గ్యాస్ తాజా పరిస్థితిపై చర్చించేందుకే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పౌర సరఫరాల శాఖ ఉన్నతాధికారులు, మిగతా2లో...

# యుద్ధ డిమాండ్లను అంగీకరించాల్సిందే...

**టెహ్రాన్,మార్చి 12 (పిసిడబ్ల్యూ న్యూస్):**ఇరాన్ వర్సెస్ ఇజ్రాయెల్, అమెరికా దేశాల మధ్య యుద్ధం 13వ రోజుకు చేరుకుంది. ఇజ్రాయెల్, అమెరికా దేశాలు సంయుక్తంగా ఇరాన్‌పై మిస్సైల్స్, డ్రోన్లతో దాడులు చేస్తున్నాయి. ఈ దాడుల్లో ఇప్పటి వరకు 1300 మంది ఇరానీయులు చనిపోయినట్లు తెలుస్తోంది. ఇరాన్ కూడా ఏమాత్రం వెనక్కు తగ్గటం లేదు. రెండు దేశాలపై విరుచుకుపడుతోంది. అరబ్ దేశాలలోని అమెరికా ఎయిర్‌బేస్‌లపై దాడులు చేస్తోంది. యుద్ధం కారణంగా ప్రపంచ దేశాలు ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆయిల్, గ్యాస్ ఎరువుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. పశ్చిమాసియా దేశాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న వేళ ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ కీలక ప్రకటన చేశారు. యుద్ధానికి ముగింపు పలకాలంటే తమ షరతులకు అంగీకరించాల్సిందేనని తేల్చి చెప్పారు. భవిష్యత్‌లోనూ తమ దేశంపై ఎవరూ దాడులు చేయకూడదని అన్నారు. తమ న్యాయపర హక్కులను ప్రపంచం గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. పశ్చిమాసియాలో శాంతి, భద్రతలకు ఇరాన్ కట్టుబడి ఉందన్నారు. అయితే, ఇరాన్ భద్రతకు గ్యారెంటీ ఇస్తేనే యుద్ధం ఆపుతామని చెప్పారు. రష్యా అధ్యక్షుడు పుతిన్, పాకిస్థాన్ ప్రధాని షహబాజ్ షరీఫ్‌తో ఫోన్‌లో మాట్లాడినపుడు కూడా ఇదే విషయం చెప్పామని అన్నారు. ఈ క్రమంలో పశ్చిమాసియా లో ఉద్రిక్తతలు నానాటికీ పెరుగుతున్నాయి. ముఖ్యంగా అమెరికా, దాని మిత్ర దేశాల నౌకలపై ఇరాన్ దాడులు తీవ్రమవుతున్నాయి. తాజాగా ఇరాక్ ప్రాదేశిక జలాల్లో రెండు ట్యాంకర్లపై 'సూసైడ్ బోటు'తో దాడి జరిగింది. ఈ ఘటనలో ఓ భారతీయుడు మృతిచెందడం గమనార్హం. పర్షియన్ గల్ఫ్‌లో ఇరాక్ తీరం సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. దాడికి గురైన నౌకలను అమెరికాకు చెందిన సేఫ్‌సీ విష్ణు, గ్రీస్‌కు చెందిన జెఫిరోస్‌గా గుర్తించారు. సేఫ్‌సీ విష్ణు నౌక మార్షల్ ఐలాండ్స్ జెండాతో ఉండగా.. జెఫిరోస్‌పై మాల్టా జెండా ఉంది. ఈ నౌకలు తీరంలో చమురు సేకరిస్తుండగా పేలుడు పదార్థాలతో ఉన్న 'సూసైడ్ బోటు' వీటిని ఢీకొట్టినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. దీంతో భారీగా పేలుడు సంభవించి పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో రెండు నౌకల్లో ఉన్న 38 మంది సిబ్బందిని రెస్క్యూ టీం సభ్యులు కాపాడారు. ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయారు. మృతుడిని భారతీయుడిగా గుర్తించారు. అయితే, అతడి పూర్తి వివరాలు మాత్రం తెలియరాలేదు. ఈ దాడి తమ పనేనని ఇరాన్ (ఎసజీని) ప్రకటించింది. ఈ మేరకు తమ అధికారిక మీడియాలో వెల్లడించింది. ఫిబ్రవరి 28న పశ్చిమాసియాలో యుద్ధం ప్రారంభమైన నాటి నుంచి పర్షియన్ గల్ఫ్, హర్మూజ్ జలసంధి మార్గంలో ప్రయాణించే చమురు నౌకలపై దాడులు జరుగుతున్న సంగతి తెలిసిందే. బుధవారం కూడా మూడు కమర్షియల్ నౌకలపై డ్రోన్ దాడులు జరిగాయి. వీటిల్లో ఓ నౌక థాయ్ జెండాతో భారత్‌కు వస్తుండగా.. యూఏఈ తీరంలో దాడి జరిగింది. మరోవైపు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తాబాకు సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. వాల్ స్ట్రీట్ జర్నల్ కథనం ప్రకారం.. ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ అమెరికా డిమాండ్లకు ఒప్పుకోవా లని ట్రంప్ స్పష్టం చేశారు.

# త్రీ ట్రిలియన్ డాలర్ ఎకానమీ సాధనలో పోలీస్ శాఖ పాత్ర కీలకం

(మొదటి పేజీ తరువాయి)

శాఖలో దశలవారీగా ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని పెంచాలని సూచించారు. అదేవిధంగా నేర నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర గణనీయంగా ఉంటుంది ఈ నేపథ్యంలో రాష్ట్రంలో సీసీ కెమెరాల వినియోగాన్ని పెద్ద సంఖ్యలో చేపట్టాలని, అవసరమైన చోట మరమ్మతులు చేపట్టాలని చిన్న కదలికను సైతం వేను వెంటనే గుర్తించి నిఘాను పటిష్టం చేసేందుకు సీసీ కెమెరాల వినియోగాన్ని పెంచాలని అందుకు అవసరమైన సహకారాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. 2047 త్రీ ట్రిలియన్ డాలర్ ఎకానమీగా లక్ష సాధనలో పబ్లిక్, ప్రైవేట్ మోడల్ అనివార్యమని ఆ విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకుని ముందుకు వెళ్లాలని పరిశ్రమల శాఖ అధికారులకు డిప్యూటీ సీఎం సూచించారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి రూరల్ అగ్రి రీజియన్ ఎకానమీ సమ ప్రాధాన్యత ఇవ్వాలని డిప్యూటీ సీఎం సూచించారు. ఈ రంగంలో పెద్ద ఎత్తున పెట్టుబడులు, పరిశ్రమలు వచ్చే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని పరిశ్రమల శాఖ అధికారులను ఆదేశించారు. మైక్రో, స్మాల్, మీడియం ఇండస్ట్రీస్ లను పెద్ద ఎత్తున ప్రోత్సహించాలనేది ప్రజా ప్రభుత్వం ఆలోచన అని తెలిపారు. రాష్ట్ర నలుమూలలోని యువతకు పెద్ద సంఖ్యలో ఉపాధి తో పాటు పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు అవకాశం ఉన్న రంగం అని తెలిపారు.

జీసీసీలతో రాష్ట్రం దేశంలోనే ప్రథమ స్థానంలో ఉందని, ఇదే వేగాన్ని కొనసాగించేందుకు ప్రభుత్వ నుంచి ప్రోత్సాహం కల్పిస్తామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుదిల్ల శ్రీధర్ బాబు అన్నారు. డాటా సెంటర్లలో ఎఐ వినియోగాన్నిపెద్ద ఎత్తున చేపట్టాలని మంత్రి శ్రీధర్ బాబుకు సూచించారు. సమావేశంలో చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, హోం శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సివి ఆనంద్, శశాంక డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో నెట్‌ఫ్లిక్స్ స్టూడియో

(మొదటి పేజీ తరువాయి)

ఆయన మాట్లాడుతూ.. బాల్యం నుంచే తనకు సినిమాలు అంటే ఇష్టం ఇష్టమన్నారు. నెట్‌ఫ్లిక్స్ హైదరాబాద్‌కు వచ్చిందంటే హాలీవుడ్ నగరానికి వచ్చినట్లే అని సీఎం వ్యాఖ్యానించారు. నెట్‌ఫ్లిక్స్‌తో తన కల నిజం కాబోతోందని వ్యాఖ్యానించారు. నెట్‌ఫ్లిక్స్ ఐలైన్ స్టూడియోస్ విస్తరణకు తమ ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందని స్పష్టం చేశారు. ఫోర్త్‌సిటీని నిర్మిస్తున్నామని.. నెట్‌ఫ్లిక్స్ విస్తరణకు కావాల్సిన భూమిని ఫ్యూచర్ సిటీలో ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. నెట్‌ఫ్లిక్స్ కార్పొరేట్ ఆఫీస్‌ను ఫ్యూచర్ సిటీకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమానికి పరిశ్రమలు, ఐటీ శాఖల మంత్రి డి. శ్రీధర్‌బాబు, సినీనటుడు రానా దగ్గుబాటి, నెట్‌ఫ్లిక్స్ ఐలైన్ స్టూడియోస్ సీఈఓ జెఫ్ షాపిరో, తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు హాజరయ్యారు.సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. తనకు సినిమాలపైన ఆసక్తి ఉందని.. తన బాల్యం నుంచి ఇప్పటి వరకు చిత్రరంగంలో అనేక మార్పులు వచ్చాయని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. బాహుబలి, కల్కి, ఆర్‌ఆర్‌ఆర్, అరుంధతి వంటి అత్యున్నత సాంకేతికతతో కూడిన సినిమాలు వచ్చాయని చెప్పుకొచ్చారు. చెన్నైలో ఉన్న తెలుగు సినిమా రంగాన్ని నందమూరి తారక రామారావు , అక్కినేని నాగేశ్వరరావు హైదరాబాద్‌కు తీసుకువచ్చారని గుర్తుచేశారు. నెట్‌ఫ్లిక్స్ హైదరాబాద్ వచ్చిందంటే హాలీవుడ్ వచ్చినట్లేనని పేర్కొన్నారు. తమ దృష్టి హాలీవుడ్‌పైనేనని తాను గతంలోనే చెప్పానని ప్రస్తావించారు. ప్రపంచంలోని 500 పెద్ద కంపెనీలను తెలంగాణకు తీసుకురావడానికి తాము ప్రయత్నం చేస్తున్నామని వివరించారు. తెలంగాణలో మీ పెట్టుబడికి పూర్తి రక్షణ ఉంటుందని.. తమ రాష్ట్రం అంటేనే వ్యాపారమని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# అసెంబ్లీలో రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు ప్రస్తావిస్తా..?

## ● ప్రభుత్వ తీరును ఎండగడతామన్న హరీష్ రావు



**హైదరాబాద్,మార్చి 12 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయలు, రిటైర్డ్ ఉద్యోగుల పై ముఖ్యమంత్రి కర్కశంగా వ్యవహరిస్తున్నారని మాజీ మంత్రి , ఎమ్మెల్యే హరీష్‌రావు ఆరోపించారు. ఉద్యోగులకు రావలసిన హక్కులను వేడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడడం దురదృష్టకరమని అన్నారు. తెలంగాణ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రతినిధులు గురువారం హరీష్ రావును కలిసి వినతి పత్రం అందచేశారు.ప్రభుత్వ తీరు వల్ల బెన్‌ఫిట్లు, పెన్షన్ బకాయిలు రాక మనోవేదనకు గురై ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని , వందల సంఖ్యలో అనారోగ్యం పాలై ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారని విమర్శించారు. ప్రభుత్వం బకాయిలు చెల్లించే వరకు ప్రభుత్వాన్ని వదిలి పెట్టబోమని, రిటైర్డ్ ఉద్యోగుల పోరాటానికి బీఆర్ఎస్ అండగా అంటుందని, అసెంబ్లీ వేదికగా నిలదీస్తామని భరోసా ఇచ్చారు. రిటైర్డ్ ఉద్యోగులకు బెనిఫిట్స్ చెల్లించకపోవడానికి కారణం డబ్బులు లేక కాదు. ముఖ్యమంత్రికి మనసు రాక అని పేర్కొన్నారు. మూసీ బ్యూటిఫికేషన్ కోసం లక్షన్నర కోట్లు, ఫ్యూచర్ సిటీ కోసం లక్ష కోట్లు, అందాల పోటీల కోసం వందల కోట్లు, తన సోకుల కోసం నిర్వహించే ఫుట్‌బాల్ మ్యాచ్‌కు 100 కోట్లు ఖర్చు చేస్తున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి క్యాంప్ ఆఫీస్ కోసం వందల కోట్లు, వివిధ రాష్ట్రాల్లో వందల కోట్లతో పత్రిక ప్రకటనలు ఇచ్చే రేవంత్ రెడ్డి, రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు చెల్లించక పోవడం దారుణమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత 98 వేల కోట్లకు టెండర్లు పిలిచారని, బడా కాంట్రాక్టర్లకు 40 వేల కోట్లు చెల్లించారని , కానీ ఉద్యోగులకు చెల్లించాల్సిన జీతాలు, బెనిఫిట్స్ కోసం మాత్రం డబ్బులు ఇవ్వడం లేదని ఆరోపించారు. కమిషన్లు రావు కాబట్టి వీరికి బకాయిలు చెల్లించడం లేదని దుయ్యబట్టారు. అసెంబ్లీ సమావేశాల్లో సమావేశాల్లో రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు, చెల్లించాల్సిన బకాయిలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని కోరారు.

# 16 నుంచి ఒంటిపూట బడులు

(మొదటి పేజీ తరువాయి)

మధ్యాహ్నం 12:30 గంటలకు భోజనం వడ్డించిన తర్వాత విద్యార్థులను ఇంటికి పంపిస్తారు. టెన్త్ ఎగ్జామ్స్ జరిగే స్కూళ్లలో షెడ్యూల్ మారుతుంది. అక్కడ మధ్యాహ్నం 1:00 గంట నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు ఒంటిపూట బడులు నిర్వహిస్తారు. పదో తరగతి విద్యార్థులకు పరీక్షల దృష్ట్యా యధావిధిగా ప్రత్యేక తరగతులు కొనసాగుతాయి. అకడమిక్ క్యాలెండర్ ప్రకారం.. ఏప్రిల్ 24 నుంచి జూన్ 11 వరకు విద్యార్థులకు వేసవి సెలవులు ఉండనున్నాయి. తిరిగి 2026-27 విద్యా సంవత్సరం జూన్ 12 నుంచి ప్రారంభం కానుంది. ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యాశాఖ ఈ నిర్ణయం తీసుకుంది.

# 14 నుంచి పదోతరగతి పరీక్షలు

(మొదటి పేజీ తరువాయి)

గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచించారు. పరీక్షల నిర్వహణ కోసం రాష్ట్రవ్యాప్తంగా 2,676 సెంటర్లు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ బడుల్లో 1,582 సెంటర్లు, ప్రైవేట్ బడుల్లో 1,094 సెంటర్లు ఏర్పాటు చేశారు. ఈ సారి 5,17,727 మంది విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నారు. పరీక్షల సందర్భంగా సెల్‌ఫోన్ల వినియోగంపై అధికారులు కఠిన ఆంక్షలు విధించారు. పరీక్ష కేంద్రాలను 'నో సెల్‌ఫోన్' జోన్లుగా ప్రకటించారు. పరీక్ష సిబ్బంది, స్కాడ్ సహా ఇతర అధికారులందరికీ ఈ నిబంధనలు వర్తిస్తాయి. తనిఖీలకు వచ్చే అధికారులు సైతం సెల్‌ఫోన్లు తీసుకెళ్లరాదు. వీరు తమ సెల్‌ఫోన్లను గది బయటే పెట్టాల్సి ఉంటుంది. ఎవరొచ్చినా తనిఖీలు చేసిన తర్వాతే లోపలికి అనుమతిస్తారు. ఒకవేళ ఎవరైనా ఈ నిబంధనలు ఉల్లంఘించి సెల్‌ఫోన్లతో విధులకు హాజరైతే వారిని సస్పెండ్‌చేస్తారు. పేపర్ లీకేజీలకు పాల్పడితే ఉద్యోగం నుంచి తొలగిస్తారు. పరీక్షలు జరుగుతుండగానే మూల్యాంకనం కూడా ప్రారంభం అవుతంది. ఈ నెల 14 నుంచి పదో తరగతి పరీక్షలు జరుగనుండగా, ఏప్రిల్ 1 నుంచి జవాబపత్రాల మూల్యాంకనం జరుగనున్నది.

# తెలంగాణలో కమర్షియల్ సిలిండర్ల కొరత

(మొదటి పేజీ తరువాయి)

చమురు కంపెనీల ప్రతినిధులతో శుక్రవారం సమీక్షిస్తామని మంత్రి ఉత్తమ్ వివరించారు. రాష్ట్రంలో రోజూ ఎన్ని కమర్షియల్ సిలిండర్లు అవసరం, సరఫరా ఏ మేరకు ఉంది, గ్యాస్ కొరతకు గల కారణాలు, అందుకు అధిగమించేందుకు తీసుకోవాల్సిన చర్యలతోపాటు ప్రత్యామ్నాయాలపై దృష్టి పెట్టేందుకున్న మార్గాలన్నింటిపై చర్చించనున్నట్లు మంత్రి ఉత్తమ్ వివరించారు. అలాగే పూర్తి వివరాలతో రావాలని ఆయిల్ కంపెనీల ప్రతినిధులతోపాటు అధికారులకు సమాచారం ఇచ్చామన్నారు. పరిస్థితి చేయి దాటి పోకుండా ఉండేందుకు ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నట్లు మంత్రి ఉత్తమ్ వెల్లడించారు.రో వైపు.. ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య భీకర పోరు కొనసాగుతోంది. దీని ప్రభావంతో దేశవ్యాప్తంగా గ్యాస్, చమురుకు తీవ్ర కొరత ఏర్పడింది. గ్యాస్ సిలిండర్లకు ఎలాంటి కొరత లేదని కేంద్రం చెబుతున్నప్పటికీ.. వాస్తవ పరిస్థితి మాత్రం పూర్తి భిన్నంగా ఉంది. తెలంగాణలో వంట గ్యాస్ సిలిండర్ల సరఫరాకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. దాంతో హోటళ్లు, హాస్టల్స్, మెస్‌లకు అవసరమైన మేర కమర్షియల్ సిలిండర్ల సరఫరా లేకపోవడంతో నగరంలో చాలా ప్రాంతాల్లో అవి మూతపడ్డాయి. ఈ నేపథ్యంలో గ్యాస్ సిలిండర్ల కొరత నివారణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. అందుకోసం శుక్రవారం వివిధ శాఖల ఉన్నతాధికారులతో పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్ష నిర్వహించనున్నారు.

# హార్ముజ్ జలసంధి మూసే ఉంచుతాం

**టెహ్రాన్,మార్చి 12 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఇరాన్ అమరవీరుల ప్రతీకారం తీర్చుకుంటామని ఆ దేశ కొత్త సుప్రీం నాయకుడు మోజ్తాబా ఖమేనీ ప్రతిజ్ఞ చేశారు. ఈ ప్రాంతంలోని అమెరికా స్థావరాలను మూసివేయాలని పిలుపునిచ్చారు. హార్ముజ్ జలసంధిని మూసేస్తామని స్పష్టం చేశారు. సుప్రీం లీడర్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మోజ్తాబా ఖమేనీ తొలిసారి బహిరంగ సందేశాన్ని గురువారం విడుదల చేశారు. గల్ఫ్ ప్రాంతంలో కొనసాగుతున్న సంఘర్షణ నేపథ్యంలో అమెరికా, హార్ముజ్ జలసంధిపై కఠినమైన వైఖరిని ప్రస్తావించారు. 'ఈ ప్రాంతంలోని అన్ని అమెరికా స్థావరాలను వెంటనే మూసివేయాలి, లేకపోతే వాటిపై దాడి కొనసాగుతుంది' అని హెచ్చరించారు.కాగా, దాడుల్లో గాయపడి ఇప్పటి వరకు బయటకు కనిపించని సుప్రీం లీడర్ మోజ్తాబా ఖమేనీ ప్రకటనను ఇరాన్ ప్రభుత్వ టెలివిజన్‌లో ఒక ప్రెజెంటర్ వినిపించారు. హార్ముజ్ జలసంధి మూసివేత కొనసాగించాలని ఒక లెవరేజ్ సాధనంగా అది ఉండాలని ఆయన అన్నారు. పొరుగు దేశాల పట్ల ఇరాన్ విధానం సహకారంగా ఉంటుందని చెప్పడానికి ప్రయత్నించారు. 'ప్రాంతీయ దేశాలతో స్నేహపూర్వక సంబంధాలకు ఇరాన్ మద్దతు ఇస్తుంది. కానీ అమెరికన్ దళాలకు ఆతిథ్యం ఇవ్వకుండా వారిని హెచ్చరిస్తుంది' అని పేర్కొన్నారు.మరోవైపు ఇరానియన్ల రక్తానికి ప్రతీకారం తీర్చుకోవడానికి తాము వెనుకాడబోమని మోజ్తాబా ఖమేనీ స్పష్టం చేశారు. స్కూల్‌పై క్షిపణి దాడిలో సుమారు 110 మంది పిల్లలతో సహా168 మంది మరణించిన నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ పోరాటాన్ని ఆయన ప్రశంసించారు.

# యుద్ధ సంక్షోభంలో భారత్ తొలి విజయం

**ముంబై,మార్చి 12 (పిసిడబ్ల్యూ న్యూస్):** అమెరికా, ఇజ్రాయెల్– ఇరాన్ మధ్య యుద్ధం నేపథ్యంలో మధ్యప్రాచ్యంలో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. అయితే ఇరాన్ ఆధీనంలోని హార్మూజ్ జలసంధిని ఒక ఆయిల్ ట్యాంకర్ సురక్షితంగా దాటింది. క్షిపణులు, డ్రోన్ దాడుల నుంచి తప్పించుకుని భారత్ చేరుకున్నది. లైబీరియా జెండా కలిగిన చమురు ట్యాంకర్ షెన్‌లాంగ్ సూయెజ్‌మాక్స్ బుధవారం ఉదయం ముంబై పోర్ట్‌కు చేరుకున్నది. మార్చి 1న సౌదీ అరేబియాలోని రాస్ తనురా ఫిప్‌యార్డ్ నుంచి ఇది బయలు దేరింది. 1,35,335 మెట్రిక్ టన్నుల క్రూడ్ ఆయిల్‌ను భారత్‌కు దిగుమతి చేసింది. కాగా, ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో కీలకమైన హార్మూజ్ జలసంధిపై ఇరాన్ ఆంక్షలు విధించింది. తమ అనుమతి లేకుండా ఈ మార్గంగుండా వెళ్లే నౌకలపై దాడులు చేస్తామని హెచ్చరించింది. దీంతో హార్మూజ్ జలసంధికి ఇరువైపులా అనేక ఆయిల్ ట్యాంకర్లు, కార్గో షిప్‌లు నిలిచిపోయాయి.మరోవైపు అమెరికాతో సహా పలు దేశాలకు చెందిన కొన్ని ఆయిల్ ట్యాంకర్లపై ఇరాన్ క్షిపణులతో దాడులు చేసింది. ఇలాంటి యుద్ధ పరిస్థితుల్లో లైబీరియా ఆయిల్ ట్యాంకర్ చాకచక్యంగా హార్మూజ్ జలసంధిని దాటింది. ముంబై పోర్ట్‌లోని జవహర్ ద్వీప్ టెర్మినల్‌కు బుధవారం ఉదయం సురక్షితంగా చేరుకున్నది. దేశంలో చమురు సంక్షోభం నెలకొన్న తరుణంలో తొలి ఆయిల్ ట్యాంకర్ భారత్ చేరడం ఊరట నిచ్చింది.

# స్పీకర్ నిర్ణయమే ఫైనల్..

(మొదటి పేజీ తరువాయి)

పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై నిర్ణీత గడువులోగా నిర్ణయం తీసుకోవాలని చెప్పినా.. స్పీకర్ నిర్ణయం తీసుకోలేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, కేటీఆర్, బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ గురువారం విచారణకు రాగా విచారణ కొనసాగించాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్ఎస్ దాఖలు చేసిన పిటిషన్లపై సుదీర్ఘ విచారణ అనంతరం ఉన్నత న్యాయస్థానం తుది తీర్పు వెలువరించింది . ఈ కేసును జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసీహ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారించగా.. స్పీకర్ తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపించారు. ఎమ్మెల్యేల అనర్హతకు సంబంధించి దాఖలైన పిటిషన్లపై తెలంగాణ స్పీకర్ ఇప్పటికే విచారణ జరిపి, తగిన నిర్ణయం తీసుకున్నారని ఆయన కోర్టుకు వివరించారు. దీంతో ఈ సమస్య సభాపతి కార్యాలయంలోనే ముగిసిందన్నారు. సింఘ్వీ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం.. ఈ వ్యవహారంపై స్పీకర్ ఇప్పటికే తుది నిర్ణయం తీసుకున్నందున విచారణ కొనసాగించాల్సిన అవసరం లేదని భావించింది. దీంతో కోర్టు విచారణ ముగిసినట్లేనని వెల్లడించింది. స్పీకర్ ఆదేశాలను రెండు రోజుల్లో అధికారికంగా ప్రచురించాలని న్యాయస్థానం ఆదేశించింది. ఆ తరువాత పిటిషనర్లకు కావాల్సిన డాక్యుమెంట్లను కూడా నాలుగు రోజుల్లో అందజేయాలని సూచించింది. దీంతో 10 మంది ఎమ్మెల్యేలకు సభాపతి క్లీన్ చిట్ ఇచ్చినట్లైంది. ఈ వ్యవహారంలో పదిమంది బిఆర్ఎస్ ఎమ్మెల్యేలకు ఊరట దక్కింది. అయితే పోరాడిన బిఆర్ఎస్‌కు మాత్రం న్యాయం దక్కలేదని ఆ పార్టీ నేతలు వ్యాఖ్యానించారు. స్పీకర్ తీర్పుపై ఇప్టపికే బిఆర్ఎస్ తన నిరసన తెలియచేసింది. స్పీకర్ తీర్పును సవాల్ చేస్తామన్న బిజెపికి కూడా ఈ తీర్పుతో ఇక అవకాశం లేనట్లుగానే భావించాలి.

# తెలుగు రాష్ట్రాలకు ఎండల నుంచి రిలీఫ్..

**అమరావతి,మార్చి 12 (పిసిడబ్ల్యూ న్యూస్):**పెరుగుతున్న ఎండలతో అల్లాడుతున్న తెలంగాణకు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) గుడ్‌న్యూస్ చెప్పింది. ఎండల నుంచి రాబోయే రోజుల్లో స్వల్ప ఉపశమనం కలగనుందని తెలిపింది. ఈ నెల 15, 16 తేదీల్లో తెలంగాణలోని పలు జిల్లాల్లో వర్షాలు పడతాయని వెల్లడించింది. ఈ నెల 23 వరకు అనేక జిల్లాల్లో ఇలాంటి పరిస్థితే ఉండొచ్చని ఐఎండీ వివరించింది.ఐఎండీ ప్రకారం.. పలుచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు పడతాయి. తూర్పు, ఉత్తర తెలంగాణలలో ఈ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. అలాగే ఈదురు గాలులతోపాటు, భారీ వర్షపాతం కూడా నమోదవ్వొచ్చు. పెరుగుతున్న సగటు ఉష్ణోగ్రతలతోపాటు తేమశాతం పెరగడం కూడా ఈ మార్పులకు కారణాలుగా వాతావరణ నిపుణులు చెబుతున్నారు. అయితే, వర్షాలు పడేవరకు ఎండల ప్రభావం ఎక్కువగానే ఉండనుంది. రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఈ నెల 14 వరకు ఎండల ప్రభావం ఎక్కువగా ఉంటుంది. మరోవైపు, అకాల వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రంగారెడ్డి, ఆదిలాబాద్, కరీంగనర్, మహబూబ్ నగర్ జిల్లాలపై ఈ ప్రభావం ఎక్కువగా ఉంటుందని, రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.తెలంగాణతోపాటు ఏపీలో కూడా ఇదేరకమైన వాతావరణం ఉండనుందని ఐఎండీ సైంటిస్టులు అంటున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన వాతావరణ ప్రభావంతో కోస్తా తీరంలో ఈదురు గాలులు వీచే అవకాశం ఉంది. ఉత్తరాంధ్ర, కోస్తా జిల్లాల్లో ఈ నెల 15 నుంచి 17 వరకు వాతావరణం చల్లగా ఉండి, పలు చోట్ల వర్షాలు పడే అవకాశం ఉంది.

# యాదాద్రీశుడిని దర్శించుకున్న గవర్నర్

(మొదటి పేజీ తరువాయి)



ఈ సందర్భంగా వారికి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. గర్భాలయంలో స్వామి అమ్మవార్లకు గవర్నర్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాతోపాటు ఆయన కుటుంబ సభ్యులకు ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం ఇచ్చారు. ఆ తర్వాత వారికి ఆలయ ఈవో భవానీ శంకర్ స్వామివారి జ్ఞాపికతోపాటు ప్రసాదాన్ని అందజేశారు. గవర్నర్ రాక సందర్భంగా యాదగిరిగుట్ట పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టారు. తెలంగాణ నూతన గవర్నర్‌గా శివ ప్రతాప్ శుక్లా బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. హైదరాబాద్ లోక్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్‌గా ప్రతాప్ శుక్లా చేత తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రమాణ స్వీకారం చేయించిన సంగతి తెలిసిందే. సీఎం రేవంత్ రెడ్డి, పలువురు మంత్రులతోపాటు ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

**పేద ప్రజలకు సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నాం**

**ఆర్గనైజేషన్ కార్యదర్శి డా. దామోదర్**





**నడికూడ,మార్చి 12 (పిసిడబ్ల్యూ న్యూస్):** పేద ప్రజలకు సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నామని సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ కార్యదర్శి డాక్టర్ పల్లెపాడు దామోదర్ అన్నారు.గురువారం ఉదయం నడికూడ మండలం పులిగిల్ల గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరానికి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. గత 30 సంవత్సరాలుగా సర్వోదయ సంస్థ పేదరిక నిర్మూలన, సుస్థిర వ్యవసాయం, మహిళా సాధికారత, మహిళా/ శిశు అభివృద్ధి, హెచ్ఐవి /ఎయిడ్స్, సహజ వనరుల అభివృద్ధి, నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. ప్రభుత్వ, ప్రభుద్వేతర సంస్థల సహకారంతో సామాజిక కార్యక్ర మాలు నిర్వహిస్తూ జాతీయంగా, అంతర్జాతీయంగా గుర్తింపు పొందినట్లు చెప్పారు. ఆశ్రయము హ్యాండ్ ఆఫ్ హోప్ సంస్థల సహకారంతో గత పది సంవత్స రాలుగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఉచిత మెగా వైద్య శిబిరాలు నిర్వహించి పేద ప్రజలకు ఉచితంగా రక్త పరీక్షలు కంటి పరీక్షలు నిర్వహించి మందులు కంటి అద్దాలు ఉచితంగా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. నడికుడా మండల విద్యాశాఖ అధికారి కె.హనుమంత రావు పాల్గొని మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ పులిగిల్ల గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో రక్త పరీక్షలు,కంటి పరీక్షలు, దంత పరీక్షలు,జనరల్ మెడిసిన్ వంటి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు,కంటి అద్దాలు, అవసరమైన వారికి ఈసీజీ తీయడం వంటి సేవలు ప్రజలకు అందించడం అభినందనీయమని అన్నారు. ఇటువంటి కార్యక్రమాన్ని గ్రామ ప్రజలందరూ ఉపయోగించుకోవాలని కోరారు. ఆశ్రయం, హోప్ ఆఫ్ హ్యాండ్ మేనేజర్ జయరాజ్, డా. భరత్, డా. దేవ సహాయం డాక్టర్ సంపత్ డాక్టర్ హిమబిందు డాక్టర్ మణికంఠ డాక్టర్ సుధీర్ మెడికల్ సిబ్బంది ఇమాన్యుల్, స్వామి, సామ్యూల్,రవి,శివ, సర్వోదయ సిబ్బంది ఇందిరా, రవీందర్, అక్తర్ వనిత,సుహాసిని, రాజేందర్, రాధ పాల్గొన్నారు. ప్రస్తుతం ఇప్పటి వరకు సుమారుగా 500 మంది కి పరీక్షలు నిర్వహించడం జరిగిందని వారు పేర్కొన్నారు.

# వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ 16వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు





**ఖమ్మం, ప్రతినిధి మార్చి 12 (పిసిడబ్ల్యూ న్యూస్):** నగరంలోని వైయస్ఆర్ కాలనీలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ 16వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానుల సమక్షంలో నిర్వహించిన ఈ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆరె శ్యామల పార్టీ జెండాను ఆవిష్కరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం పార్టీ స్థాపనకు కారణమైన ఆశయాలు, ప్రజా సంక్షేమ లక్ష్యాలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీ ప్రజల సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని ముందుకు సాగుతోందని ఆమె పేర్కొన్నారు. వైయస్ఆర్ ఆశయాలను ప్రతి కార్యకర్త ప్రజల్లోకి తీసుకెళ్లాలని, పార్టీ బలోపేతానికి ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీ స్థాపన నుంచి ప్రజా సమస్యల పరిష్కారానికి వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తోందని నాయకులు తెలిపారు. భవిష్యత్తులో కూడా ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునే విధంగా సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పార్టీ నాయకులు, మహిళా నాయకులు, యువజన విభాగ సభ్యులు, కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పార్టీ జెండా ఆవిష్కరణ అనంతరం నాయకులు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకొని, మిఠాయిలు పంచుకుని వేడుకలను ఆనందంగా జరుపుకున్నారు. పార్టీ నినాదాలతో ప్రాంతం మొత్తం సందడిగా మారింది.

# ఎన్‌పీపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా గవ్వల భరత్ కుమార్

**పార్టీని బలోపేతం చేసి యువతను రాజకీయాల్లోకి ఆహ్వానించాలని పార్టీ జాతీయ అధ్యక్షులు, మేఘాలయ సీఎం కొండ్రాడ్ సంగ్మా సూచన**

**హైదరాబాద్ మార్చి 12(పిసిడబ్ల్యూ న్యూస్):** నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్ పీపి) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా గవ్వల భరత్ కుమార్‌ను పార్టీ జాతీయ నాయకత్వం నియమించింది. ఇప్పటి వరకు తెలుగు రాష్ట్రాలకు ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేసిన ఆయన సేవలను గుర్తించి ఈ కీలక బాధ్యతలను అప్పగించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. తెలంగాణలో పార్టీ కార్యకలాపాలను మరింత విస్తరించి ప్రజలకు చేరువ చేయడంలో గవ్వల భరత్ కుమార్ కీలక పాత్ర పోషిస్తారని పార్టీ నాయకులు విశ్వాసం వ్యక్తం చేశారు. ముఖ్యంగా యువతను రాజకీయాల్లోకి తీసుకురావడంలో ఆయన చేసిన కృషి ప్రత్యేకంగా గుర్తింపు పొందింది. గవ్వల భరత్ కుమార్ గతంలో బీసీ జాతీయ సంక్షేమ సంఘంలో కీలక బాధ్యతలు నిర్వహించారు. అలాగే బీసీ యువజన సంఘం, బీసీ విద్యార్థి సంఘాల్లో నాయకత్వం వహిస్తూ బీసీ వర్గాల హక్కుల కోసం అనేక కార్యక్రమాలు చేపట్టారు. యువత సమస్యలపై నిరంతరం స్పందిస్తూ పలు ఉద్యమాలు నిర్వహించారు గవ్వల భరత్ కుమార్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలు అప్పగించిన నేషనల్ పీపుల్స్ పార్టీ జాతీయ అధ్యక్షులు, మేఘాలయ ముఖ్యమంత్రి కొండ్రాడ్ సంగ్మా, జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షులు జేమ్స్ సంగ్మా, జాతీయ ప్రధాన కార్యదర్శి పక్నా బాగే, జాతీయ యువజన సంఘం అధ్యక్షులు నీఖా నంక్ల తదితర నేతలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేసి ప్రజా సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తానని ఆయన తెలిపారు. తెలంగాణలో పార్టీ అభివృద్ధి కోసం అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని ముందుకు సాగుతామని, ముఖ్యంగా యువతను రాజకీయాల్లోకి తీసుకువచ్చి కొత్త నాయకత్వాన్ని తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని గవ్వల భరత్ కుమార్ పేర్కొన్నారు. ఈ నియామకంతో తెలంగాణలో నేషనల్ పీపుల్స్ పార్టీకి మరింత బలం చేకూరుతుందని పార్టీ నేతలు అభిప్రాయం వ్యక్తం చేశారు.



# ప్రజా పాలనప్రగతి ప్రణాళిక శిక్షణకు కల్లూరు పురపాలక సభ్యుల ప్రయాణం

**ఖమ్మం భక్త రామదాసు కళాక్షేత్రంలో 99 రోజుల అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన**

**కల్లూరు, మార్చి 12 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా ప్రజాప్రతినిధులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ఖమ్మం భక్త రామదాసు కళాక్షేత్రంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కల్లూరు మున్సిపాలిటీకి చెందిన ప్రజాప్రతినిధులు తరలి వెళ్లారు. ఈ శిక్షణ కార్యక్రమానికి కల్లూరు మున్సిపాలిటీ నూతన చైర్మన్ ధారావత్ మోహన్ నాయక్, వైస్ చైర్మన్ శీలం కోటేశ్వరి తో పాటు పలువురు పాలకవర్గ సభ్యులు హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళికను సమర్థవంతంగా అమలు చేయడం, పట్టణాల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేయడం, ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించడం వంటి అంశాలపై ఈ శిక్షణలో అవగాహన కల్పించారు. పట్టణ అభివృద్ధి, పారిశుధ్యం, మౌలిక సదుపాయాల మెరుగుదల, ప్రజా సేవల నాణ్యత పెంపు వంటి అంశాలపై అధికారులు ప్రజాప్రతినిధులకు వివరించారు. ఈ శిక్షణ ద్వారా ప్రజాప్రతినిధులు పట్టణాభివృద్ధికి మరింత సమర్థంగా పనిచేయగలరని అధికారులు పేర్కొన్నారు.



# గణతంత్ర వేడుకల్లో సత్తాచాటిన వరంగల్ విద్యార్థి

**● ఎన్.సి.సి కార్యాలయంలో దాసరిరాకేష్‌కు ఘన సన్మానం**



**వరంగల్, మార్చి 12 (పిసిడబ్ల్యూ న్యూస్):** దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొని వరంగల్ జిల్లా కీర్తిని జాతీయ స్థాయిలో చాటిన వాగ్దేవి ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థి జి. రాకేష్‌ను వరంగల్‌లోని ఎన్.సి.సి కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. **గర్వకారణం:** కల్నల్ పి.పి. కిషోర్‌ఈ సందర్భంగా 1వ తెలంగాణ సి.టి.ఆర్ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ పి.పి. కిషోర్ మాట్లాడుతూ, దేశ ప్రథమ పౌరురాలు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వంటి ప్రముఖుల సమక్షంలో జరిగిన ప్రతిష్టాత్మక వేడుకల్లో పాల్గొనడం సాధారణ విషయం కాదని, ఇది జిల్లాకే గర్వకారణమని కొనియాడారు. కఠోర శ్రమ, క్రమశిక్షణతోనే ఇలాంటి అవకాశాలు లభిస్తాయని ఆయన పేర్కొన్నారు. దాసరి రాకేష్‌ను శాలువాతో సత్కరించి, అభినందన పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కల్నల్ కిషోర్‌తో పాటు సీనియర్ జె.సి.ఓ మహమ్మద్ ఆరీఫ్,సి.టి.ఓ పవన్ కళ్యాణ్, ఎన్.సి.సి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. దాసరి రాకేష్ సాధించిన ఈ విజయం తోటి విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని, భవిష్యత్తులో అతను మరిన్ని శిఖరాలను అధిరోహించాలని అతిథులు ఆకాంక్షించారు.

# దోస్త్ 2026లో కాకతీయ ప్రభుత్వ కళాశాలలో చేరాలని ప్రిన్సిపాల్ పిలుపు..



**హనుమకొండ : మార్చి 12 (పిసిడబ్ల్యూ న్యూస్):** కాకతీయ ప్రభుత్వ కళాశాల (స్వయంప్రతిపత్తి) హనుమకొండ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి. శ్రీనివాస్ మాట్లాడుతూ, కాలేజియేట్ ఎడ్యుకేషన్ కమిషనర్ శ్రీమతి ఎ. శ్రీ దేవసేన 12.03.2026న హైదరాబాద్‌లో జరిగిన ప్రిన్సిపాల్స్ సమీక్ష సమావేశంలో కళాశాల బ్రోచర్‌ను విడుదల చేశారని తెలియజేశారు. రాష్ట్రంలోని టాప్ 10 కళాశాలల్లో ఈ కళాశాల ఒకటి అని ప్రిన్సిపాల్ కూడా తెలియజేశారు. దోస్త్ 2026లో విద్యార్థులు ఈ కళాశాలలో చేరాలని ఆయన అభ్యర్థించారు.

# రంజాన్ పండుగ సందర్భంగా ఇఫ్లూ యూనివర్సిటీలో సహాయక సిబ్బందికి చీరాల పంపిణీ

**● ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉపకులపతి ప్రొఫెసర్ నాగరాజు : సిబ్బందికి శుభాకాంక్షలు**



**హైదరాబాద్ మార్చి12(పిసిడబ్ల్యూ న్యూస్):** హైదరాబాద్‌లోని ఇఫ్లూ విశ్వవిద్యాలయంలో ప్రతి సంవత్సరం నిర్వహించే రంజాన్ పండుగ కార్యక్రమం సందర్భంగా ఎన్‌టీఎస్‌డబ్ల్యూఏ ఉపాధ్యక్షుడు మహమ్మద్ అల్తాఫ్ ఆధ్వర్యంలో సహాయక సిబ్బందికి చీరాల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ నాగరాజు ముఖ్య అతిథిగా హాజరై సిబ్బందికి రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ సినీ మంచాల, ప్రధాన క్రమశిక్షణాధికారి శ్యామ్ రావు రాథోడ్, ప్రొఫెసర్ సత్యనారాయణ, ప్రత్యేక విధుల అధికారి రాజారాం, ప్రజా సంబంధాల అధికారి శ్రీహరి, డాక్టర్ ఉపేందర్, డాక్టర్ రాజ్ కుమార్ పాల్గొన్నారు. అలాగే ఉద్యోగుల సంఘం అధ్యక్షురాలు లిజీ కుసుమ, ప్రధాన కార్యదర్శి కిషన్ నాయ నాయక్, వ్యవస్థాపక కార్యదర్శి రాజు, ఉపాధ్యక్షులు బర్లపాటి జయరాం సహా బోధన మరియు బోధనేతర సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సహాయక సిబ్బందికి చీరాలను పంపిణీ చేసి రంజాన్ పండుగను ఆనందంగా జరుపుకున్నారు.

# కల్లూరు మున్సిపాలిటీలో డోజర్ బ్లేడ్ ఛానల్ మాయం భద్రతపై ప్రశ్నలు



**కల్లూరు, మార్చి 12 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కల్లూరు మున్సిపాలిటీ కార్యాలయం ఆవరణంలో ఉంచిన డోజర్ బ్లేడ్‌కు ఉపయోగించే భారీ ఇనుప ఛానల్ మాయం కావడం స్థానికంగా కలకలం రేపుతోంది. సాధారణంగా ముగ్గురు లేదా నలుగురు కలిసి మాత్రమే ఎత్తగలిగేంత బరువైన ఈ ఇనుప ఛానల్‌ను గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లినట్లు సమాచారం. మున్సిపాలిటీ కార్యాలయం వంటి కీలక ప్రదేశంలోనే ఇలా విలువైన సామగ్రి మాయం కావడం పట్ల స్థానిక ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. పగలు లేదా రాత్రి సమయంలో ఎప్పుడు ఈ ఘటన జరిగిందనే విషయంపై ఇంకా స్పష్టత రాలేదు. మున్సిపాలిటీ పరిధిలోని పనులకు ఉపయోగించే ఈ ఛానల్ కనిపించకపోవడంతో సిబ్బంది అప్రమత్తమయ్యారు. ఘటనపై మున్సిపల్ అధికారులు ప్రాథమికంగా ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. ఎవరు తీసుకెళ్లారు? ఎలా తీసుకెళ్లారు? అనే అంశాలపై విచారణ కొనసాగుతోంది. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా మున్సిపాలిటీ ఆస్తుల భద్రతపై అధికారులు మరింత జాగ్రత్తలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. కార్యాలయ ప్రాంగణంలో భద్రతా ఏర్పాట్లు బలోపేతం చేసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# బూరుపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ వార్షికోత్సవంలో భాగంగా...






**గంగాధర మార్చి 12(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలోని బూరుగుపల్లి గ్రామంలో విద్యార్థులు స్వీయ క్రమశిక్షణ పాటిస్తూ ఏకాగ్రత తో చదివితే ఉన్నతస్థాయి కి ఎదుగుతారని, తద్వారా సమాజంలో మంచిపేరు , గౌరవం లభిస్తుంది అని జెడ్ పి హెచ్ ఎస్ బూరుగుపల్లి విద్యార్థులకు ఈ రోజుజరిగిన వార్షికోత్సవశీ మరియు 10 వ తరగతి విద్యార్థుల వీడుకోలు సమావేశం లో గంగాధర ఎంపీడీవో రాము అన్నారు. ఈ రోజు జెడ్ పి హెచ్ ఎస్ బూరుగుపల్లి పాఠశాలలో అంగరంగ వైభవంగా 10 వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు మరియు పాఠశాల వార్షికోత్సవ0 జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ కళ్యాణ్ 10 వ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్ విరాళంగా అందజేశారు. మరియు పదవ తరగతి లో మొదటి ర్యాంకు వచ్చిన వారికి 5000 వేల రూపాయలు ఇస్తానని ప్రకటించారు. ఈ కార్యక్రమం లో గౌరవ గంగాధర మండల ఎం పి డి ఓ రాము , బూరుగుపల్లి గ్రామ సర్పంచ్ శ్రీ కళ్యాణ్ , కొండయ్యపల్లి సర్పంచ్ శ్రీ వినయ్ సాగర్ , ఉప సర్పంచ్ తిరుపతి , ఏ ఏ పి సి ఛైర్పర్సన్ మాధవి , విలేజ్ సెక్రటరీ , వార్డ్ మెంబెర్స్, ప్రధానోపాధ్యాయులు ఐతీ. ఎలిగేటి మల్లికార్జున్ , ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు. సాయంకాలం వరకు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.

# 14న జరిగే అంజన్న ఆశీర్వాద యాత్రకు తరలిరండి

## - ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్మికులకు జేఏసీ చైర్మన్ చాడ ఆనంద్ పిలుపు...




**కరీంనగర్,మార్చి13(పీసీడబ్ల్యూ న్యూస్):** భారతీయ జనతా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు, కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఈనెల 14న చేపట్టనున్న కొండగట్టు అంజన్న స్వామి ఆశీర్వాద పాదయాత్ర లో కార్మికులంతా పాల్గొనాలని ఉమ్మడి జిల్లా కార్మిక జేఏసీ చైర్మన్ చాడ ఆనంద్ కోరారు. ఈ మేరకు గురువారం రోజున చాడఆనంద్ మీడియాకు ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 14వ తేదీ శనివారం ఉదయం 7 గంటలకు కరీంనగర్ చైతన్యపురి సమీపంలోని మహాశక్తి ఆలయం వద్ద నుండి ఘనంగా ప్రారంభమై కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయం వరకు జరుగుతున్న ఈ పాదయాత్రలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఉన్న భవన నిర్మాణ కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ పాదయాత్ర ద్వారా కార్మికుల ఐక్యత మరింత బలపడటంతో పాటు సామాజిక చైతన్యం పెంపొందించి ప్రజా సమస్యలపై అవగాహన పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్మికులు పాదయాత్రకు మద్దతు తెలుపుతూ కొండగట్టు ఆంజనేయ స్వామి వారి దివ్య ఆశీస్సులు పొందాలని ఆయన కోరారు. కరీంనగర్ పట్టణంలో ఉన్న కార్మికులు మరియు కార్మిక సంఘాల నాయకులు ఉదయం మహాశక్తి ఆలయం వద్దకు చేరుకోవాలని, అలాగే మిగతా మండలాలు, గ్రామాలలో ఉన్న కార్మిక నాయకులు పాదయాత్రకు మార్గమధ్యంలో స్వాగతం పలుకుతూ పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా జేఏసీ చైర్మన్ చాడా ఆనంద్ ఈ ప్రకటనలో కోరారు.

# బార్ కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నికైన పొన్నం అశోక్ గౌడ్ కలిసిన సిరాజ్ హుస్సేన్..



**కరీంనగర్ టౌన్ మార్చి 12(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ మొదటి సభ్యుడిగా ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్ ను హైదరాబాదులోని హైకోర్టులో కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ హుస్సేన్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పొన్నం అశోక్ గౌడ్ ను శాలువాతో సత్కరించి అభినందనలు శుభాకాంక్షలు తెలిపారు అనంతరం సిరాజ్ హుస్సేన్ మాట్లాడుతూ సీనియర్ న్యాయవాదిగా సుదీర్ఘ అనుభవం కలిగిన పొన్నం అశోక్ గౌడ్ బార్ కౌన్సిల్ మెంబర్ గా ఎన్నిక కావడం అభినందనీయమన్నారు. అదేవిధంగా బార్ కౌన్సిల్ ను ఒక మోడల్ గా తీర్చిదిద్దడంలో కీలకపాత్ర పోషించనున్నారని పేర్కొన్నారు. న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పాటుపడుతున్నారని తెలిపారు. రాబోయే రోజుల్లో పొన్నం అశోక్ గౌడ్ బార్ కౌన్సిల్ కు దేశంలోనే ఒక మంచి గుర్తింపు తీసుకొస్తారని సిరాజ్ హుస్సేన్ పేర్కొన్నారు.

# నిమజ్జనంతో ముగిసిన సుగుటూరు గంగమ్మ జాతర



**ఏపీ : అన్నమయ్య జిల్లా పుంగనూరు: మార్చి 11 (పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** పుంగనూరు పట్టణం ప్యాలెస్ కాంపౌండ్ ఆవరణంలో వెలిసి ఉండు శ్రీ సుగుటూరు గంగమ్మ జాతర మంగళ, బుధవారాలలో అత్యంత వైభవంగా నిర్వహించారు. గురువారం ఉదయం నిమజ్జనం నిమిత్తం అమ్మవారిని ప్యాలెస్ కాంపౌండ్ నుండి శ్రీ చాముండేశ్వరి అమ్మవారి ఆలయం వద్ద వరకు ఊరేగింపుగా తీసుకెల్లి కోనేటిలో అమ్మవారి నిమజ్జన పూజ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అమ్మవారిని తిరిగి ప్యాలెస్ కు ఊరేగింపుకు వెళ్లి జమీందారీ వంశస్థులచే అమ్మవారి విగ్రహాన్ని ప్రత్యేక గదిలో భద్రపరుస్తారు. ఈ కార్యక్రమంలో వేల సంఖ్యలో భక్తులు పాల్గొని తమ మొక్కులు తీర్చుకున్నారు. జాతర సందర్భంగా జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఆదేశానుసారం సి. ఐ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# సన్‌షైన్ లెర్నింగ్ స్కూల్ విద్యార్థినిని అభినందించిన జిల్లా విద్యాధికారి- శారద

- ఆత్మవిశ్వాసం మరియు ధైర్యం ఉంటే మనం ఏదైనా సాధించగలం - కరస్పాండెంట్ సయ్యద్ నసీర్







**పెద్దపల్లి మార్చ్ 13 (పిసి డబ్ల్యూ న్యూస్):** అంతర్జాతీయ మహిళా దినోత్సవం (మార్చి 8) ఆదివారం రోజున పెర్కాస్ స్టూడియో కూకట్పల్లి హైదరాబాదులో మనం సేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవార్డు కార్యక్రమంలోపెగడపల్లి సన్‌షైన్ లెర్నింగ్ స్కూల్లో 4వ తరగతి చదువుతున్న ఓజ్జా నిత్య డ్రాగన్స్ కుంగ్- ఫు సెల్ఫ్ డిఫెన్స్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ లో నైపుణ్యాన్ని ప్రదర్శించి,రేసింగ్ స్టార్ గర్ల్స్అవార్డు తీసుకుంది.అవార్డు తీసుకున్న ఓజ్జా నిత్యకు పెద్దపెల్లి జిల్లా విద్యాధికారిణి (డిఇఓ) శారద,మెడలు వేసి ట్రోఫీ సర్టిఫికేట్ అందజేసి ప్రత్యేక అభినందనలు తెలిపారు. పాఠశాల కారస్పాండెంట్ సయ్యద్ నజీర్,గ్రాండ్ మాస్టర్ కొండిల సదానందం పాల్గొన్నారు.పెద్దపల్లి జిల్లా విద్యాధికారిని శారద మాట్లాడుతూ రాబోయే రోజుల్లో మరిన్ని అవార్డుసు తీసుకోవాలని ప్రోత్సహించారు. పాఠశాల కరస్పాండెంట్ సయ్యద్ నజీర్ మాట్లాడుతూ పిల్లలు చదువుతోపాటు అన్ని రంగాల్లో ముందు ఉండాలని కోరారు. జాతీయ కరాటే పోటీలలో విజేతాలుగా నిలబడిన విద్యార్థులని అభినందించారు. సన్ షైన్ లర్నింగ్ స్కూల్ పెగడపల్లి విద్యార్థుల ఉన్నత స్థాయికి చేర్పించడమే వారి లక్ష్యం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి శారద సూపరిండెంట్ శ్రీధర్ ,డి సీ ఈ ఓ కవిత,డి వై ఎస్ ఓ సురేష్ , సురేందర్ , సీనియర్ అసిస్టెంట్ చంద్ర కిరణ్ పైసల్ రాజ్ కుమార్ మరియు ఓజ్జా శ్రీనివాస్ పాల్గొని విద్యార్థిని అభినందించారు.

# ఈనెల 14న ఎంఐఎం పార్టీ ఆధ్వర్యంలో దావతే ఇఫ్తార్


- ఎమ్మెల్సీ మిర్జా రహ్మత్ బేగ్ కరీంనగర్ రాక
- ఆమీర్ నగర్ మధు గార్డెన్లో ఏర్పాట్లను పరిశీలించిన ఎంఐఎం నేతలు





**కరీంనగర్ టౌన్ మార్చి 12(పిసిడబ్ల్యూ న్యూస్):** పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని శనివారం నగరంలోని కమాన్ టూ హౌసింగ్ బోర్డ్ రోడ్ లో గల మధు గార్డెన్ లో ఎంఐఎం పార్టీ ద్వారా దావతే ఇఫ్తార్ తో పాటు భోజన సౌకర్యాన్ని ఏర్పాటు చేసినట్లు ఎంఐఎం పార్టీ కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ తెలిపారు. ఎంఐఎం అధినేత బారిష్టర్ అసదుద్దీన్ ఒవైసీ ఆదేశాల మేరకు ఎంఐఎం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన దావతే ఇఫ్తార్ కార్యక్రమ సన్నాహక ఏర్పాట్లను, ఎంఐఎం నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ దారుసలాం లో సమీక్ష నిర్వహించారు. మధు గార్డెన్ చేరుకొని ఏర్పాట్లపై పరిశీలించారు. ఈసందర్భంగా గులాం అహ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ ఈ దావతే ఇఫ్తార్ కార్యక్రమ ఏర్పాట్లను తమ అధినేత బారిష్టర్ అసదుద్దీన్ ఒవైసీ ఆదేశాల మేరకు చేస్తున్నామని వెల్లడించారు. ఈకార్యక్రమానికి ఎమ్మెల్సీ రహ్మత్ బేగ్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ దావతే ఇఫ్తార్ లో ఉపవాస దీక్షలు పాటించే ప్రతిఒక్కరికి ఆహ్వానం ఉందని, ఉమ్మడి జిల్లాకు చెందిన, కరీంనగర్ నగరానికి సంబంధించిన ఎంఐఎం పార్టీ కార్యకర్తలు, నాయకులు అభిమానులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో వస్తుండటంతో, సుమారు 4వేల మందికి సరిపడా భోజన ఏర్పాట్లు, ఇఫ్తార్ విందు ఏర్పాట్లను చేస్తున్నామన్నారు. సాయంత్రం 4:30గంటల మధు గార్డెన్ చేరుకొని మౌలాన బయాన్ ఉంటుందన్నారు. అనంతరం ఉపవాస దీక్షను విరమించి ఇఫ్తార్ చేసుకొని, ఇదే ఫంక్షన్ హాల్లో మగ్రిబ్ నమాజ్ చేసుకునేలా ఏర్పాటు చేశామని, అనంతరం భోజన ఏర్పాట్లను చేశామన్నారు. కావున కరీంనగర్ పట్టణ ముస్లిం సమాజం భారీ సంఖ్యలో తరలివచ్చి ఎంఐఎం పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన దావతే ఇఫ్తార్ కార్యక్రమానికి హాజరై పెద్ద ఎత్తున విజయవంతం చేయాలని గులాం అహ్మద్ పిలుపునిచ్చారు.

# అగ్రవర్ణ పేదలకు 10 శాతం రిజర్వేషన్ కల్పించాలి



**గంగాధర, మార్చి 12(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలం అగ్రవర్ణ పేదలకు 10 శాతం రిజర్వేషన్ కల్పించాలని అగ్రవర్ణాల పేదల సమితి రాష్ట్ర అధ్యక్షులు బి రెడ్డి కరుణాకర్ రెడ్డిఅన్నారు. దేశంలో అగ్రవర్ణాల కోట 65 కోట్లు ఉన్నప్పటికీ వాటిలో దాదాపు 80 శాతం మంది పేదరికంలో జీవిస్తున్నారని స్వాతంత్రం వచ్చినప్పటి నుండి ఈ డబుల్ ఎస్ కు ఎటువంటి రిజర్వేషన్లు ప్రభుత్వ ప్రయోజనాలు లేకుండా వివిధ ఇబ్బందులు పడుతున్నారని అన్నారు తమ పరిష్కరణ తమ పరిష్కారాల కోసం ఈ డబ్బులు కార్పొరేషన్ ను స్థాపించి రాజ్యాంగం హోదా కల్పించడం ద్వారానే అగ్రవర్ణాల జీవితాలు మెరుగుపడతాయని అగ్రవర్ణాల పేదల దుస్థితిని తీసుకుని పరిగణలోకి తీసుకొని ఈ డబ్బులు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని వెదిర గ్రామస్తుడు బి రెడ్డి కరుణాకర్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

# నూతన దంపతులను ఆశీర్వదించిన కిషన్ రావు



**నడికూడ,మార్చి 12(పిసిడబ్ల్యూ న్యూస్):**తెలంగాణ రైతు రక్షణ సమితి కమలాపూర్ మండల అధ్యక్షులు శనిగరం గ్రామవాసి అయిన నూనె రమేష్ -రజిత దంపతుల ఏకైక పుత్రిక నిహా -ప్రమోద్ వివాహ మహోత్సవం నడికూడా మండల కేంద్రంలోని మారుతి గార్డెన్‌లో ఘనంగా జరిగగా ఈ కార్యక్రమానికి రైతు రక్షణ సమితి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వరికెల కిషన్ రావు హనుమకొండ జిల్లా అధ్యక్షులు హింగే భాస్కర్, నడికుడ మండల అధ్యక్షులు వాంకే రాజు తదితరులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

# ఆల్ ఇండియా ర్యాంకు సాధించిన భవ్యష్‌కు ఘన సత్కారం





**ఖమ్మం, ప్రతినిధి మార్చి 12 (పిసిడబ్ల్యూ న్యూస్):** శ్రీనివాస్ నగర్ 17వ డివిజన్‌కు చెందిన మున్నూరు కాపు కుల బంధువు కూరాకుల మోహన్ చిన్న కుమారుడు కూరాకుల భవ్యష్ జాతీయ స్థాయి పరీక్షల్లో ప్రతిభ కనబరిచి ప్రాంతానికి గర్వకారణంగా నిలిచారు. ఇటీవల ప్రకటించిన ప్రొఫెషనల్ పరీక్షల్లో అద్భుత ఫలితాలు సాధించి అందరి ప్రశంసలు అందుకున్నారు.గత నెల ఫిబ్రవరి 11న ప్రకటించిన సీఎంఏ (కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంటెంట్) పరీక్షలో ఆల్ ఇండియా స్థాయిలో 25వ ర్యాంక్, అలాగే మార్చి 8న ప్రకటించిన సీఏ ఇంటర్ (చార్టర్డ్ అకౌంటెంట్) పరీక్షలో ఆల్ ఇండియా 39వ ర్యాంక్ సాధించి తన ప్రతిభను చాటుకున్నారు. చిన్న వయసులోనే జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించడం విశేషమని స్థానికులు ప్రశంసించారు. 17వ డివిజన్ మున్నూరు కాపు సంఘ సభ్యులు భవ్యష్‌ను ఘనంగా సత్కరించి అభినందించారు. భవిష్యత్తులో ఇంకా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, చదువుల తల్లి సరస్వతి ఆశీస్సులతో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సంఘ గౌరవ అధ్యక్షులు ఆకుతోట రాజశేఖర్, అధ్యక్షులు పగడాల మోహన్ రావు, కార్యదర్శి ముత్యం కొండలరావు, కోశాధికారి వాసంశెట్టి రామారావు, ఉపాధ్యక్షులు పద్మం వెంకటేశ్వరరావు, అలాగే పుల్లారావు, కానూరి కిరణ్ కుమార్, ధూళిపాల కోటేశ్వరరావు పాల్గొన్నారు.

## బక్కి అశోక్‌ని పరామర్శించిన నెక్కొండ మండల కాంగ్రెస్ సర్పంచ్‌లు



**నెక్కొండ మార్చ్13(పీసీడబ్ల్యూ న్యూస్):** వరంగల్ జిల్లా నెక్కొండ లో ఇటీవల నెక్కొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బక్కి అశోక్ కాలు కి గాయం కాగా వారి నివాసానికి వెళ్లి పరామర్శించిన కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ లు నెక్కొండ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్, అప్పలరావుపేట సర్పంచ్ ఉడుగుల అశోక్, పత్తిపాక సర్పంచ్ లావుడ్యా సామ్యా,సాయిరెడ్డి పల్లి సర్పంచ్ బండారుపల్లి వినాయకుమారి,గుండ్రపల్లి సర్పంచ్ బొల్ల యాదాలక్ష్మి,అప్పలరావు పేటమాజీ ఎంపీటీసీ మచ్చ వీరన్న, అప్పలరావుపేట 7వ వార్డ్ సభ్యులు కొయ్యడ శ్రీనివాస్,ఉడుగుల రాజు తదితరులు పాల్గొన్నారు.

## కొడకండ్లలో వివాహ వేడుకల్లో పాల్గొన్న పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి

**కొడకండ్ల మార్చ్13(పీసీడబ్ల్యూ న్యూస్):** పాలకుర్తి నియోజకవర్గం, కొడకండ్ల మండలం చెరువు ముందు తండాలో గురువారం జరిగిన వివాహ వేడుకలకు పాలకుర్తి శాసనసభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కొడకండ్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ధరావత్ సురేష్ నాయక్ ఆహ్వానం మేరకు, ఆయన అన్న కుమార్తె సంగీత చందూలాల్‌ల వివాహ వేడుకలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. నూతన వధూవరులపై అక్షతలు వేసి, వారి దాంపత్య జీవితం ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షి ంచారు. స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు మరియు కార్యకర్తలను ఆమె ఆత్మీయంగా పలకరించారు. ఈ వేడుకలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, వధూవరుల బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## యాస అంజిరెడ్డిని పరామర్శించిన జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు వాకిటి అనంతరెడ్డి

**వలిగొండ మార్చ్13(పీసీడబ్ల్యూ న్యూస్):** మండల పరిధిలోని మొగిలిపాక గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు యాస అంజిరెడ్డి మాతృమూర్తి మరణించగా వారి కుటుంబాన్ని గురువారం జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు వాకిటి అనంతరెడ్డి పరామర్శించారు. ఆయన ప్రగాఢ సానుభూతి తెలియజేసి అనంతరం అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఆర్టిఓ యాస శేఖర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు మామిడి సత్తిరెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు పబ్బు ఎల్లయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# దళితవాదమే కాంగ్రెస్ పునాది...

### - మళ్లీ మేమే అధికారంలోకి వస్తాం: టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్







**హైదరాబాద్,మార్చ్13(పీసీడబ్ల్యూ న్యూస్):** దళితవాదం పునాదితోనే కాంగ్రెస్ పార్టీ నిర్మితమై ఉన్నదని అందుకే దళితుల అభ్యున్నతికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి పని చేస్తున్నదని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, శాసనమండలి సభ్యుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. గాంధీభవన్లో జరిగిన టిపిసిసి ఎస్సి సెల్ చైర్మన్ గా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పదవీ ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ఆది నుండి కాంగ్రెస్ పార్టీ దళితుల సంక్షేమానికి పాటుపడుతూ వస్తున్నదని, ఆ క్రమంలోనే రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం పనిచేస్తూ దళితుల పక్షపాతిగా పేరు తెచ్చుకున్నదని చెప్పారు. దళితులు కూడా కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండడం వల్లనే ఇన్నాళ్లు కేందాన్ని, రాష్ట్రాన్ని పాలించగలిగిందని ఆయన చెప్పారు. దళితులను విస్మరించే ఏ రాజకీయ పార్టీ కూడా మనుగడ సాధించదని ఆయన స్పష్టం చేశారు.కాంగ్రెస్ పార్టీ అధికారం రేవంత రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలతోపాటు దళితులు సంతోషంగా ఉన్నారని, ఈ కారణంగానే వచ్చే ఎన్నికల్లో 100కు పైగా స్థానాలను గెలుచుకోవడం ద్వారా రాష్ట్రంలో తిరిగి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీలో ఎస్సీ విభాగం అత్యంత కీలక, ఈ విభాగాన్ని శక్తివంతంగా తీర్చిదిద్దే బాధ్యతను డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణకు అప్పగించామని ఆయన చెప్పారు. రానున్న రోజుల్లో దళితులకు అధిక ప్రాధాన్యాలు కల్పిస్తామని ఆయన చెప్పారు.ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి దళితులు ప్రధాన భూమిక పోషించారన్నారు. ఆ క్రమంలోనే రాష్ట్ర ముఖ్యమంత్రి కూడా దళితుల అభినందికి పెద్దపీట వేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేదు విధంగా నలుగురు ఎస్సీలకు మంత్రి పదవులు ఇచ్చిన ఘనత రేవంత్ రెడ్డికి దక్కిందన్నారు. రాష్ట్రంలో ఎస్సీ సెల్ ను బలోపేతం చేయడానికి కొత్త చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ తో కలిసి పనిచేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని, పూర్తిస్థాయిలో అతనికి సహకరిస్తానని చెప్పారు. రాహుల్ గాంధీ రాజ్యాంగం చేత పట్టుకొని దేశవ్యాప్తంగా తిరుగుతుండటం వల్ల దళితులకు సామాజిక హోదా పెరిగిందన్నారు. రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే దళితుల లక్ష్యం కావాలన్నారు. దేశ ప్రజల ఆత్మగౌరవాన్నీ ప్రధాని నరేంద్ర మోదీ అగ్ర రాజ్యం అమెరికాకు తాకట్టు పెట్టారని అద్దంకి విమర్శించారు. ట్రంప్ చెబుతేనే గ్యాస్,పెట్రోల్, డీజిల్ కొనే దుస్థితికి మోడీ చేరుతున్నారని ఆయన ఎద్దేవా చేశారు.టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ గా పదవి స్వీకారం చేసిన డాక్టర్ కదంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ దళితుల మధ్య సుహృద్భాన్ని భావాన్ని పెంచి వారి ఏకం చేసే లక్ష్యంగా పనిచేస్తానని చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశీస్సులతోనే తాను ఎమ్మెల్యేగా, డీసీసీ అధ్యక్షుని కాగలిగానని, ఇప్పుడు కూడా ఎస్సీ సెల్ చైర్మన్ అయ్యానని వారి ఆశలు ఆశయాలను నెరవేర్చడమే కర్తవ్యం గా పనిచేస్తానని ఆయన హామీ ఇచ్చారు. దామాషా ప్రకారం ఎస్సీలకు 15 శాతం రిజర్వేషన్లు కల్పించాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు టిఆర్ఎస్ పాలనలో దళితులకు ఇచ్చిన అసైన్మెంట్ భూములను లాక్కున్నారని తిరిగి దళితులకు ఆ భూములను ఇప్పించాలని ఆయన కోరారు. అంతేకాకుండా అన్యాక్రాంతమైన భూములను స్వాధీనం చేసుకోవడానికి చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఎస్సీలకు ఉద్దేశించి ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఆయన కోరారు. టిఆర్ఎస్ పాలనలో దళితులు తీరని అవమానాలు ఎదుర్కొన్నారని, ఉపముఖ్యమంత్రిగా ఉన్న రాజయ్యను ఉన్నఫలంగా బర్తరఫ్ చేసి ఆయనను మానసిక క్షోభకు గురి చేశారన్నారు.ఈ కార్యక్రమంలో అంబేద్కర్ ఆశయవాది జేబీ రాజు, బీసీ సంక్షేమం, రవాణా శాఖ మాత్యులు పొన్నం ప్రభాకర్, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యేలు వేముల వీరేశం, తోట లక్ష్మీకాంత రావు, మందుల సామ్యేల్,శ్రీనివాస్ రెడ్డి,మేడిపల్లి సత్యం, నాగరాజు,మాజీ మంత్రులు మోత్కుపల్లి నర్సింహులు,గడ్డం వినోద్ వెంకటస్వామి మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, పుష్పలీల మాజీ ఎమ్మెల్యేలు ఆరెపల్లి మోహన్, సంపత్ కుమార్, ఎస్సీ సెల్ మాజీ చైర్మన్ ప్రీతం, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, కరీంనగర్ నియోజకవర్గ ఇంచార్జి వెలిచాల రాజేందర్ రావు,జువ్వాడి నర్సింగ రావు,ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం. పాపయ్య, దళిత ఉద్యమ నేత ఆరేపల్లి రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

# అవకాశాలు లేని చోట నూతన వనరులు సృష్టించడమే లక్ష్యం: మంత్రి సీతక్క



**ములుగు జిల్లా,మార్చ్13(పీసీడబ్ల్యూ న్యూస్):** అవకాశాలు లేని చోట నూతన వనరులను కల్పించడమే తమ అంతిమ లక్ష్యమని, భోజనం లేని వారికి భోజనం పెట్టడం, నీడ లేని చోట చెట్టు నాటడం, ఇల్లు లేని వారికి ఇల్లు కల్పించడం ద్వారా కలిగే ఆనందం మాటల్లో చెప్పలేనిదని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు.గురువారం ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని గుర్రాల బావి గ్రామంలో హైదరాబాద్‌కు చెందిన Electronics Corporation of India Limited (ఈసీఐఎల్) సంస్థ ఏర్పాటుచేసిన కంటైనర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను మంత్రి సీతక్క జిల్లా కలెక్టర్‌తో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వనరులు, అవకాశాలు లేని ప్రాంతాల్లో కొత్త సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అటవీ ప్రాంతాల్లో శాశ్వత భవనాల నిర్మాణానికి అనుమతులు లేని చోట ప్రత్యామ్నాయంగా కంటైనర్ పాఠశాలలు, ఆసుపత్రులు, అంగన్‌వాడీలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.ఈ ప్రాంతంలో నివసిస్తున్న వారు సుమారు 25 సంవత్సరాల క్రితం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో జరిగిన సల్వా జుడుం ఉద్యమం కారణంగా వలస వచ్చారని తెలిపారు. వారికి కనీస విద్య, విద్యుత్, తాగునీటి సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వం బాధ్యతగా భావిస్తున్నామని పేర్కొన్నారు.ఈ ప్రాజెక్టుకు సహకరించిన ఈసీఐఎల్ సంస్థ ప్రతినిధులు, ముఖ్యంగా సంతోష్ రామస్వామి బృందాన్ని, అలాగే ఏర్పాటుకు కృషి చేసిన జిల్లా కలెక్టర్, ఎస్పీ, విద్యాశాఖ అధికారులు, స్థానిక యువతను మంత్రి సీతక్క అభినందించారు. గతంలో శిథిలావస్థలో ఉన్న భవనాలు లేదా చెట్ల కింద చదువుకునే పరిస్థితి ఉండగా, ఇప్పుడు విద్యార్థులకు సురక్షితమైన వాతావరణంలో చదువుకునే అవకాశం కలిగిందని సంతోషం వ్యక్తం చేశారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ప్రభుత్వ పాఠశాల మంజూరు అయినప్పటికీ కొన్ని కారణాల వల్ల భవనం నిర్మాణం జరగలేదని తెలిపారు. విద్యార్థులకు చదువు అందించాలనే ఉద్దేశంతో ఈసీఐఎల్ సంస్థ సహకారంతో కంటైనర్ పాఠశాల ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సహకారం అందించిన సంస్థకు కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సుదీర్ రామ్నాథ్ కేకన్, ఏటూరునాగారం ఏఎస్పీ, గ్రంథాలయ చైర్మన్ భానోత్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, డీఈవో సిద్ధార్థ రెడ్డి, ఈసీఐఎల్ సంస్థ బృందం, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ కార్మికుల చెమటకు గౌరవం ఇవ్వాలి, పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలి

● భారతీయ మజ్దూర్ సంఘ్ జిల్లా కార్యదర్శి తొర్తి శ్రీనివాస్



**కరీంనగర్ రూరల్ మార్చి 12(పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ రూరల్ మండలంలోని చామనపల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పని ప్రదేశాన్ని సందర్శించి కార్మికుల యొక్క సమస్యలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ పేదల జీవనోపాధికి బలమైన ఆధారం అయిన గ్రామీణ ఉపాధి హామీ చట్టం ద్వారా ప్రతి గ్రామీణ కుటుంబానికి సంవత్సరానికి 125 రోజుల ఉపాధి హామీ ఇవ్వాలని ప్రభుత్వం చట్టబద్ధంగా నిర్ణయించింది. ఈ చట్టం వల్ల లక్షలాది మంది పేద కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. కానీ ప్రస్తుతం ఉపాధి హామీ కార్మికులు ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నారు. పని చేసిన తర్వాత కూడా వేతనాలు నెలల తరబడి రావడం లేదు. పని ప్రదేశాల్లో తాగునీరు,నీడ విశ్రాంతి స్థలం,ప్రథమ చికిత్స వంటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలి.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు సమయానికి రాకపోవడం వల్ల పనులు ఆగిపోతున్నాయి. అదే విధంగా ఫేస్ గుర్తింపు కోసం పని కి ముందు, తర్వాత ఫోటో తీసి అప్లోడ్ చేయడానికి సిగ్నల్స్, సాఫ్ట్వేర్ ప్రాబ్లం వల్ల ఎన్నో సమస్యలు తలెత్తుతున్నాయి. ముదురుతున్న ఎండలను దృష్టిలో ఉంచుకొని వేసవి భత్యం కూడా ప్రతి కార్మికునికి కల్పించాలి. అదేవిధంగా 125 రోజులు పనిని కల్పించే ఆలోచన కింద ప్రభుత్వానికి ఉన్నట్లయితే దానికి కావలసిన బడ్జెట్ ను ఏర్పాటు చేయాలని, ఈ విషయాన్ని కేంద్ర మంత్రులు, పార్లమెంట్ సభ్యులు చర్చించి కార్మికులకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకోవాలని కోరడం జరిగింది.



# నిజమైన భూదాన్ బాధితులకు తీవ్ర అన్యాయం




### - పైరవీ కారులకు పట్టాలు ఇచ్చారు

### - రీ సర్వే చేసి నిజమైన లబ్ధిదారులకు న్యాయం చేయాలి

### - అక్రమాలకు పాల్పడ్డ వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

### - విలేకరుల సమావేశంలో

### వెలుగుమట్ల భూదాన్ బాధితులు

**ఖమ్మం, ప్రతినిధి మార్చి 12 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఖమ్మం వెలుగుమట్లలో నిజమైన భూదాన్ బాధితులకు ప్రభుత్వం పట్టాలు ఇవ్వకుండా, కొంతమంది అనర్హులకు, అక్రమార్కులకు, పైరవీకారులకు పట్టాలు పంపిణీ చేశారని, అసలైన బాధితులకు తీవ్ర అన్యాయం జరిగిందని భూదాన్ భూముల బాధితులు పేర్కొన్నారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో భూదాన్ బాధితులు సత్యనారాయణ రెడ్డి, నరగాని కోటేశ్వరరావు, రవి, సీతారాములు, కళ్యాణి, కవిత, జయమ్మ లు మాట్లాడుతూ... 8 సంవత్సరాలుగా తాము వెలుగుమట్ల భూదాన్ భూములలో గుడిసెలు వేసుకుని, ఇండ్లు నిర్మించుకొని నివాసం ఉంటున్నామని, కొందరు వ్యక్తులు తమ వద్ద డబ్బులు వసూలు చేసి ఇండ్ల స్థలాలు ఇస్తామని చెప్పి తమను మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ అధికారులు హడావుడిగా, సక్రమంగా సర్వే చేయకుండా అసలైన లబ్ధిదారులను గుర్తించకుండా, కాలనీకి చెందని వారికి పట్టాలి ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు..? ఎటువంటి సౌకర్యాలు లేకపోయినా రాత్రింబవళ్లు చీకట్లో ఉండి పాములు, తేళ్ల మధ్య నివాసం గడిపి, నీళ్లు లేక, కరెంటు లేక అనేక ఇబ్బందులు పడ్డ తమలాంటి కుటుంబాలను గుర్తించకుండా అనర్హులను ఎలా ఎంపిక చేస్తారని నిలదీశారు. సర్వం కూలిపోయి రోడ్డు పాలైన తమలాంటి వారికి అన్యాయం చేయటం సరైనది కాదన్నారు. మరొక్కసారి రీ సర్వే నిర్వహించి నిజమైన లబ్ధిదారులను గుర్తించి తమను ఆదుకోవాలని వేడుకున్నారు. ఈ విలేకరుల సమావేశంలో సిరికొండ కళ్యాణి, గాదె భాగ్యలక్ష్మి, పసుమర్తి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్ కాంట్రాక్టర్ నిర్లక్ష్యం యువకుడు బలి...

● లారీ ఢీకొని ట్రాక్టర్ డ్రైవర్ మృతి





**ములుగు మార్చ్ 12 (పిసిడబ్ల్యూ న్యూస్):** రోడ్ కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా యువకుడు ప్రాణాలు కోల్పోయిన ఘటన ములుగు జిల్లాలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం ములుగు జిల్లా మల్లంపల్లి మండల కేంద్రం సమీపంలో రోడ్డు పనుల కారణంగా వన్‌వే ఏర్పాటు చేసినప్పటికీ ఎలాంటి సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం ప్రమాదానికి కారణమైంది. మహమ్మద్ గౌస్‌పల్లి నుంచి మల్లంపల్లి వైపు ట్రాక్టర్ నడుపుకుంటూ వెళు తున్న బానోతు ఈశ్వర్ (22)ను ములుగు నుంచి హనుమకొండ వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. వన్‌వే ఏర్పాటు చేసిన విషయాన్ని గమనించని లారీ డ్రైవర్ ట్రాక్టర్‌ను బలంగా ఢీకొట్టడంతో ట్రాక్టర్ డ్రైవర్ బానోతు ఈశ్వర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదానికి ప్రధాన కారణం రోడ్డు కాంట్రాక్టర్ నిర్లక్ష్యమేనని మృతుడి బంధువులు మరియు స్థానికులు ఆరోపిస్తున్నారు. వన్‌వే ఏర్పాటు చేసిన ప్రాంతంలో హెచ్చరిక బోర్డులు, సూచికలు ఏర్పాటు చేయకపోవడంతోనే ప్రమాదం జరిగిందని వారు తెలిపారు. సంఘటన స్థలానికి చేరుకున్న ములుగు పోలీసులు ఎస్సై ఉపేందర్, చంద్రశేఖర్ మృతదేహాన్ని ములుగు ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉపేందర్ తెలిపారు.

## డంపింగ్ యార్డ్ పరిస్థితులపై ఆకస్మిక తనిఖీ

● కల్లూరు మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్

● పొగతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు తాత్కాలిక ఉపశమనం

కొత్త డంపింగ్ యార్డ్ కోసం స్థల సేకరణ



**కల్లూరు, మార్చి 12 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కల్లూరు పట్టణంలో డంపింగ్ యార్డ్ పరిస్థితులపై మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్ సాయంత్రం ఆకస్మికంగా పరిశీలన నిర్వహించారు. పాత డంపింగ్ యార్డ్‌లో పేరుకుపోయిన చెత్త కారణంగా పొగలు ఎగసిపడుతూ సమీప ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను దృష్టిలో ఉంచుకుని తాత్కాలికంగా ఉపశమనం కలిగించే చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రేపటి నుండి డంపింగ్ యార్డ్ వద్ద మోటారు ద్వారా నీటిని చల్లి పొగలు తగ్గించే చర్యలు చేపడతామని చెప్పారు. కొత్త డంపింగ్ యార్డ్ కోసం ఇప్పటికే మున్సిపల్ కార్యవర్గం స్థల సేకరణ ప్రక్రియను ప్రారంభించినట్లు వెల్లడించారు. కొత్త డంపింగ్ యార్డ్‌కు చెత్త తరలించే వరకు ప్రజలు కొంతకాలం సహకరించాలని ఆయన కోరారు. ప్రజలకు ఇబ్బందులు తగ్గేలా మున్సిపాలిటీ తరఫున అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ పరిశీలనలో మున్సిపల్ కమిషనర్ రామ దుర్గారెడ్డి, మూడో వార్డు కౌన్సిలర్ సుధారాణి, 16వ వార్డు కౌన్సిలర్ ఉబ్బన రాంబాబు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కల్లూరు తహసీల్దార్ కార్యాలయంలో సబ్-కలెక్టర్ సమీక్షా సమావేశం

**పెండింగ్ దరఖాస్తులు, మీ సేవ, రేషన్ కార్డులు, భూసేకరణ అంశాలపై అధికారులకు దిశానిర్దేశం**



**కల్లూరు, మార్చి 12 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కల్లూరు తహసీల్దార్ కార్యాలయంలో సబ్-కలెక్టర్ ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం నిర్వహించబడింది. రెవెన్యూ శాఖకు సంబంధించిన వివిధ సేవల అమలు, పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం, ప్రజలకు అందుతున్న సేవల నాణ్యత వంటి అంశాలపై అధికారులు విస్తృతంగా చర్చించారు. సమావేశంలో ముఖ్యంగా బిబి 60 కేటగిరీలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల ప్రస్తుత స్థితిని సమీక్షించారు. అలాగే ఆర్‌ఎస్, ఎస్ డి బి, బిబి ఫైళ్ల పురోగతి, వాటి పరిష్కార ప్రక్రియపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మీసేవ మరియు కె ఎల్ ఎస్ ఎం ద్వారా వచ్చిన దరఖాస్తుల ప్రస్తుత స్థితి, వాటి పరిష్కారం ఎంతవరకు జరిగిందన్న అంశంపై కూడా సబ్-కలెక్టర్ ప్రత్యేకంగా ఆరా తీశారు. ఫుడ్ సెక్యూరిటీ కార్డుల జారీ, పెండింగ్ దరఖాస్తుల స్థితి, ప్రజల నుంచి వచ్చిన పిటిషన్ల పరిష్కారం వంటి అంశాలను కూడా సమీక్షించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన బి ఎల్ వో మ్యాపింగ్, అలాగే ఫారమ్‌లు 6, 7, 8ల ప్రస్తుత స్థితి గురించి అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. గత 14 రోజులలో నమోదు అయిన భూ రిజిస్ట్రేషన్లు, రద్దులు, వాటి కారణాలు వంటి వివరాలను పరిశీలించారు. అదేవిధంగా తహసీల్దార్ లాగిన్ టైమింగ్ వివరాలను కూడా పరిశీలిస్తూ కార్యాలయ పనితీరు మెరుగుపర్చాలని సూచించారు. భూసేకరణ, భూ అలియనేషన్ ఫైళ్ల పురోగతి, అలాగే ఈసీఆర్ సంబంధిత అంశాలపై కూడా సమీక్ష నిర్వహించారు. ప్రజలకు అందుతున్న సేవలు వేగంగా, పారదర్శకంగా అందేలా చర్యలు తీసుకోవాలని సబ్-కలెక్టర్ అధికారు లకు సూచనలు జారీ చేశారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

# పేదరికంలేని భారతదేశంగా తయారు చేయండి

- సి.పి.ఐ జాతీయనాయకులు కె. నారాయణ
- మావోయిస్టులను చంపొచ్చేమో గానీ మావోయిజ సిద్ధాంతాన్ని చంపడం ఎవరితరం కాదు
- బలమైన దేశానికి బలహీన ప్రధాని
- యుద్ధ ప్రభావంతో ధరల పెరుగుదల
- రాష్ట్రపతి ముర్ము వైఖరి సమర్థనీయం కాదు
- కమ్యూనిస్టులను బలహీనపర్చడమే వారిధ్యేయం
- జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని, కాలయాపన తగదన్నారు.
- సి.పి.ఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని




**ఖమ్మం ప్రతినిధి, మార్చి 12 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మావోయిస్టు రహిత భారతదేశం కాదు, పేదరికంలేని భారతదేశంగా తయారు చేయాలని, ప్రపంచంలోనే అత్యంత బలమైన ప్రజాస్వామ్యపునాధులున్న భారతదేశానికి మోడీ అత్యంత బలహీన ప్రధాని అని, యుద్ధాన్ని ఆపే కనీస ప్రయత్నం చేయలేదని సి.పి.ఐ జాతీయ కంట్రోల్ కమీషన్ ఛైర్మెన్ డాక్టర్ కె. నారాయణ ఆరోపించారు. ట్రంపు కు సాగిలపడటం తప్ప మోడీ మరేపని చేయలేక పోతున్నారని, ఇందిరాగాంధీకి ఉన్న ధైర్యంలో 5 శాతం కూడా లేదని ఆయన అన్నారు. గురువారం స్థానిక గిరిప్రసాద్ భవన్ లో జరిగిన మీడీయా సమావేశంలో నారాయణ మాట్లాడుతూ... భారతదేశంపై యుద్ధప్రభావం ప్రారంభమైందని, గ్యాస్ ఇతర నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి పోతున్నాయని, ఎగుమతులు నిలిచిపోవడంతో వ్యయసాయ ఉత్పత్తుల ధరలు కూడా పడిపోనున్నాయని ఆయన తెలిపారు. అమెరికా అధ్యక్షులు ట్రంప్ ఆర్థిక వనరులున్న దేశాలపై దాడులు చేసి ఆక్రమించే ప్రయత్నంచేస్తున్నారని, వెనుజులా తరువాత ఇరాన్ పై యుద్ధం చేస్తున్నాడని, క్యూబా పై కూడా దాడికి ప్రయత్నచేస్తున్నాడని తెలిపారు. ట్రంప్ ను చూసి మోడీ బయపడుతున్నాడని, 140 కోట్లమంది దేశప్రజల ఆత్మగౌరవాన్ని ట్రంప్ కు మోడీ తాకట్టుపెట్టారన్నారని విమర్శించారు. ట్రంప్ కు వ్యతిరేకంగా మోడీ నోరు విప్పాలని, మూడో ప్రపంచ యుద్ధ పరిస్థితులు నెలకొంటున్నదశలో శాంతికి అలీనదేశంగా భారత్ గట్టి ప్రయత్నం చేయాలని అన్నారు. రాష్ట్రపతి ద్రౌపతిముర్మూ వైఖరి సమర్ధనీయం కాదని, రాష్ట్రపతిగా ఆదివాసీ మహిళ ఉన్నందుకు గర్వపడుతున్నాము కాని ఆదివాసీలకు నష్టంచేసే చర్యలు ప్రభుత్వానికి అనుమితులివ్వడాన్ని మాత్రం సమర్ధించబోమని అన్నారు. అటవీ హక్కుల చట్టాన్ని మార్చి అటవీ భూములను కార్పోరేట్ కు అప్పగించే భాగంగానే ముర్ముకు రాష్ట్రపతి పదవిచ్చి అమె చేతనే ఆదివాసులకు నష్టం కలిగించే చర్యలకు బీజేపీ ఆమోదం తీసుకుంటుందన్నారు. ఆపరేషన్ కగార్ తో మావోయిస్టులను చంపి, అడవుల నుంచి ఆదివాసీలను తరమి ఆ భూములను కార్పోరేట్లకు కట్టబెడుతున్నారని, మావోయిస్టు నేతలను చంపిన ప్రతిసారి కార్పోరేట్లకు వేల ఎకరాలు స్వాధీనం చేయడమే ఇందుకు నిదర్శనమన్నారు. వ్యక్తులుగా సహరించి తాత్కాలికంగా ఆనందం పొందవచ్చునేమో కాని సిద్దాంతాన్ని నశింపచేయలేరని అది ఎవరి తరంకాదని నారాయణ స్పష్టం చేశారు. మావోయిస్టురహిత భారతదేశం కాదు, పేదరికం లేని భారతదేశంగా తయారు చేయాలని ఆయన అమిత్ షాకు సవాల్ విసిరారు. ఖమ్మం వెలుగుమట్ల ఘటనపై స్పందిస్తూ భూస్వామ్య భూములను కమ్యూనిస్టులు ఆక్రమించే క్రమంలోనే భూదాన ఉద్యమం వచ్చిందన్నారు. ఈ దేశంలో ముఖ్యంగా తెలంగాణాలో లక్షల ఎకరాల భూములను పేదలకు పంచిన చరిత్ర కమ్యూనిస్టులకు ఉందన్నారు. వెలుగుమట్లలో నివాసాలను కూల్చడం ఎందుకు తిరిగి అక్కడే పట్టాలివ్వడం ప్రజాధనం ఎందుకు వృధా చేస్తున్నారని నారాయణ ప్రశ్నించారు. అక్కడ నివశించేదెవరూ భారతీయులు కాదా, పేదలందరికీ పట్టాలు అందచేయాలని ఆయన డిమాండ్ చేశారు. అర్థంపర్థం లేని చర్యలు రియల్టర్లకోసమే జరిగాయని ఇది దుర్మార్గమైన చర్యగా ఆయన అభివర్ణించారు.

**కమ్యూనిస్టులను బలహీనపర్చడమే వారిధ్యేయం : కూనంనేని**

కమ్యూనిస్టులను బలహీన పర్చడమే వారిధ్యేయమని అందుకే కమ్యూనిస్టులపై అనవసర విమర్శలు చేస్తున్నారని సి.పి.ఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలిపారు. మేము ఎలా పేనిచేయాలో మాకు తెలుసునని పేదల పక్షాన పనిచేయడమే మా కర్తవ్యమని, విద్వేశంతో మాపై విమర్శలు చేయడం తగదన్నారు. రాష్ట్రంలో 8 వేల మంది పేదలతో గుడిసెలు వేయించామని వాటికి పట్టాలివ్వాలని 58 జి.ఓ ద్వారా రెగ్యులర్ చేయాలని పోరాడుతున్నామన్నారు. నివాసస్థలాల పంపిని, ఇళ్ళ నిర్మాణం ప్రభుత్వ బాధ్యత అని, అది బిక్షకాదని కూనంనేని తెలిపారు. కమ్యూనిస్టుల పోరాట ఫలితంగానే లక్షల ఎకరాల భూపంపిణీ జరిగిందని, నిత్యం ప్రజల కోసమే మాపోరాటమని, కుహానా వాదుల సూచనలు మాకు అవసరం లేదన్నారు. ఇచ్చిన హామీ మేరకు జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని, కాలయాపన తగదన్నారు. మావోయిస్టుల త్యాగాలను సి.పి.ఐ గుర్తించిందని, ప్రజా పోరాటాలకు కలిసిరావాలని కోరామన్నారు. వ్యక్తిగత అవసరాల కంటే ప్రజా సమస్యల పరిష్కారానికే సి.పి.ఐ కృషి చేస్తుందని ఆయన తెలిపారు. కమ్యూనిస్టుల అవసరం ఈ సమాజానికి ఉందని, రానున్న కాలంలో మరింత బలపడాల్సిన అవసరం ఉందన్నారు. సి.పి.ఐ ప్రజా ప్రతినిధులకు ఈనెల 13, 14 తేదీలలో రెండు రోజుల పాటు పాల్వంచలో శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఈ కార్యక్రమానికి జాతీయ నాయకులు కె.నారాయణ, పల్లా వెంకటరెడ్డి, కె.రామకృష్ణ తదితరులు హాజరు కానున్నారని కూనంనేని తెలిపారు.

## లైంగిక వేధింపులకు పాల్పడ్డా మంత్రి అనుషరుడు సర్పంచ్ భర్త శ్రీకాంత్ మహిళా మంత్రి గా భాధ్యత ఆవిస్తూ రాజీనామా చెయ్యాలి: డా జాడి రామరాజు నేత



**ఏటూరునాగారం,మార్చి 12 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మర్చి 11 గురువారం రోజున ఏటూరునాగారం మండల కేంద్రం లో బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు డా జాడి రామరాజు నేత ఏటూరునాగారం మండల కేంద్రం లో మాట్లాడుతూ మహిళ శిశు సంక్షమా శాఖ మంత్రి నియోజకవర్గం లో మంత్రి అనూషర్ల వలన మహిళ లకే రక్షణ లేకుండా పొయ్యిందని అన్నారు అదేవిదంగా మంత్రి అనుసార్లు గుట్టెవుల సర్పంచ్ భర్త అంబాల శ్రీకాంత్ ఇంటికి వచ్చిన బాలిక పైన లైంగిక వేధింపులకు పాల్పడినప్పటికీ కనీసం మహిళ మంత్రిగనైనా స్పందిస్తూ బాధ్యత ఆవిస్తూ రాజీనామా చెయ్యాలని అన్నారు అదేవిదంగా ఒక్క బాలిక ను లైంగిక వేధింపులకు గురించేసిన కాంగ్రెస్ నాయకునిగా వెనుకేసుకొని రావడానికి కారణం ఏమిటో చెప్పాలని అదేవిదంగా స్పందించ క పోవడానికి కారణం ఏమిటో చెప్పాలని అన్నారు అదేవిదంగా అధికారం ను అడ్డుపెట్టుకొని కాంగ్రెస్ పార్టీ నాయకులు భూ కబ్జాలు సెటిల్ మెంట్లు చేస్తూ ప్రతిపక్ష పార్టీ నాయకులపై అక్రమ కేసులు పెట్టిస్తు భయభ్రాంతులకు గురించేస్తున్నారని అన్నారు అదేవిదంగా ఇందిరమ్మ ఇండ్ల కు కూడా ఒక్క ఇంటికి 30వేల నుండి 50వేలు సీఎం రిలీఫ్ ఫొండ్ కూడా కమిషన్ వసూల్ చేస్తున్నా కాంగ్రెస్ నాయకులకు ఏజెన్సీ ప్రాంత ప్రజలు తాగిన విదంగా గుణపాఠం చెప్పాలని అన్నారు ఇప్పటికైనా ఏజెన్సీ ప్రాంత కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ ల దగ్గర కు మహిళ లు ఒంటరిగా పోకుండా జాగ్రత్త పడాలని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు డా జాడి రామరాజు నేత అన్నారు


# ఆర్యవైశ్యుల శక్తి అపారం




● జయాపజయాలను ప్రభావితం చేయగలరు ● వాసవీ పారాయణం ప్రపంచ రికార్డు సృష్టించాలి

**మేడిపల్లి మార్చి 12 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఆర్యవైశ్యుల శక్తి అపారం..వారు తలచుకుంటే రాజకీయాలను , జయాపజయాలను ప్రభావితం చేయగలరని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. వారు రాజకీయాల్లో ఎదగాలన్నారు. ప్రపంచ రికార్డు సృష్టించే స్థాయిలో ఆర్యవైశ్యులు వాసవి మాత పారాయణం చేయ తలపెట్టడం హర్షణీయమని అన్నారు. ఎల్బీ స్టేడియం దద్దరిల్లేలా నలభై వేల మందితో... భవిష్యత్తులో ఎవరూ చేయలేని విధంగా వాసవీమాత పారాయణం చేయాలన్నారు. ఆ రికార్డు కార్యక్రమంలో తాను కూడా పాల్గొంటానని తెలిపారు శ్రీ వాసవీ మహాశక్తి మహోత్సవం పేరిట 22న హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో జరిగే సామూహిక పారాయణానికి సంబంధించి గురువారం బంజారా హిల్స్ పార్క్ హోటల్ కర్టెన్ రెయిజర్ కార్యక్రమం జరిగింది. తెలంగాణ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత గుప్త ఆధ్వర్యం లో జరిగిన మంత్రి వాకిటి శ్రీహరి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ కల్వ సుజాత సంకల్పాన్ని కొనియాడారు. . శ్రీ వాసవీ మహాశక్తి మహోత్సవం విజయవంతం కావాలని ఐ అండ్ పీ ఆర్ కమిషనర్ సీహెచ్ ప్రియాంక ఆకాంక్షించారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్ పర్సన్ కాల్వ సుజాత మాట్లాడుతూ 21,000 మందితో సామూహిక పారాయణానికి వైశ్యులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. అందుకు తగిన ఏర్పాటు చేశామని వెల్లడించారు ఈ పారాయణం ప్రపంచ రికార్డు కాబోతోందని అన్నారు. ప్రముఖ కవి శ్రీనివాస్ రచించిన 102 చరణాల వాసవీ మాత స్తుతి గీతాన్ని ఆలపించనున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా, ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యానారాయణ గుప్తా కొణిజేటి సుబ్బారావు, ఉప్పల శ్రీనివాస్ గుప్తా, చీకోటి ప్రవీణ్ , కాచం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# లుక్‌తో అంచనాలు పెంచుతున్న చైతూ



'తండేల్' సినిమా సూపర్ హిట్ తర్వాత నాగ చైతన్య కెరీర్ విషయంలో మరింత జాగ్రత్తలు తీసుకుంటున్నాడని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. ఆయన ఎంపిక కూడా అలాగే అనిపిస్తుంది. చాలా కాలంగా ఎదురు చూస్తున్న నాగచైతన్య మూవీ అప్‌డేట్ వచ్చింది. విరూపాక్ష దర్శకుడు కార్తీక్ దండు దర్శకత్వంలో నాగ చైతన్య హీరోగా వృషకర్మ రూపొందుతున్న విషయం తెల్సిందే. మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో నాగ చైతన్య లుక్ పై ఇటీవలే క్లారిటీ వచ్చింది. ఇప్పటి వరకు చైతన్యను చూడని విధంగా దర్శకుడు కార్తీక్ చూపించబోతున్నాడు. అంతే కాకుండా నాగ చైతన్య యొక్క గత చిత్రాలతో పోల్చితే ఈ సినిమా పూర్తి విభిన్నంగా ఉంటుందని అంటున్నారు. విరూపాక్ష సినిమాకు ఏమాత్రం తగ్గకుండా దర్శకుడు కార్తీక్ ఈ సినిమాను రూపొందించే పనిలో ఉన్నాడని తెలుస్తోంది. తాజాగా నాగ చైతన్య షేర్ చేసిన ఈ ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. బీయింగ్ అర్జున్ అంటూ జిమ్‌లో డంబెల్స్‌తో వర్కౌట్ చేస్తున్న ఫోటోలను షేర్ చేయడంతో పాటు, ఆన్ సెట్ ఫోటోలు, సినిమాలోని లుక్ ను రివీల్ చేయడం ద్వారా నాగ చైతన్య మరోసారి సినిమా గురించి చర్చ జరిగేలా చేశాడు. అర్జున్ పాత్ర కోసం నాగ చైతన్య ఎంతగానో కష్టపడుతున్నాడు. జిమ్‌లో ఆయన వర్కౌట్స్ గంటల పాటు సాగుతున్నట్లు ట్రైనర్ చెప్పుకొచ్చాడు. ఇప్పటికే నాగ చైతన్య సిక్స్ ప్యాక్ బాడీతో చాలా ఫిట్ గా కనిపిస్తున్నాయి. గతంలో ఎప్పుడూ లేని విధంగా చాలా ఫిట్‌గా నాగ చైతన్య కనిపిస్తున్నాడు అంటూ ఈ ఫోటోలకు అభిమానులు తెగ కామెంట్స్ చేస్తున్నారు. నాగ చైతన్య లుక్ కి అంతా ఫిదా కావడం మాత్రమే కాకుండా వృషకర్మ సినిమాపై అంచనాలు మరింతగా పెరుగుతున్నాయి.తండేల్ సినిమా తర్వాత.. సాధారణంగా నాగ చైతన్య అనగానే ఒక సాఫ్ట్ కార్నర్ కుర్రాడు గుర్తుకు వస్తాడు. కానీ ఈ సినిమా తర్వాత మొత్తం మారబోతుంది. తండేల్‌తో కొంత వరకు తన ఇమేజ్‌ను మార్చుకున్న నాగ చైతన్య ఇప్పుడు పూర్తిగా తన ఇమేజ్ ను మార్చుకునే పనిలో ఉన్నాడట. పూర్తి స్థాయి యాక్షన్ సినిమాలు గతంలో చేసిన నాగ చైతన్య, అందుకు తగ్గ ఫిజిక్ ను ట్రై చేయలేదు. కానీ ఈసారి పాత్రలకు తగ్గట్లుగా ఫిజిక్ ను రెడీ చేసుకుంటూ, తన అభిమానులను నూటికి నూరు శాతం సంతృప్తి పరచడం కోసమే అన్నట్లుగా నాగ చైతన్య సినిమాలకు రెడీ అవుతున్న తీరు చూస్తుంటే ముచ్చటేస్తుందని ఇండస్ట్రీలో టాక్ వినిపిస్తుంది. ఈ మధ్య కాలంలో నాగ చైతన్య సినిమాల సంఖ్య తగ్గించినప్పటికీ క్వాలిటీ పెంచాడనే టాక్ కూడా ఉంది. మరో వంద కోట్ల మూవీ లోడ్ కావాలి అంటే ఇంతకు మించి అన్నట్లుగా నాగ చైతన్య కష్టపడాల్సిందే అంటూ అభిమానులు మాట్లాడుకుంటున్నారు.


వృషకర్మ సినిమా నిర్మాణంలో సుకుమార్ భాగస్వామ్యం కావడంతో పాటు, ఆయన స్క్రిప్ట్ వర్క్ సలహాలు కచ్చితంగా వర్కౌట్ అవుతాయనే విశ్వాసంను అంతా వ్యక్తం చేస్తున్నారు. విభిన్న చిత్రాలతో దర్శకుడు కార్తీక్ దండు ముందు ముందు స్టార్ దర్శకుల జాబితాలో చేరబోతున్నాడనే విశ్వాసం కూడా వ్యక్తం అవుతోంది. మైథలాజికల్ యాక్షన్ అడ్వెంచర్ థ్రిల్లర్ మూవీగా ఈ సినిమా ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు. ఇటీవల విడుదలైన ఫస్ట్ లుక్ వీడియోకు మంచి స్పందన వచ్చింది. సినిమా ఎప్పుడెప్పుడు విడుదల అవుతుందా అని అక్కినేని ఫ్యాన్స్‌తో పాటు అన్ని వర్గాల ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ సినిమాతో నాగ చైతన్య బాక్సాఫీస్ వద్ద మరోసారి తన సత్తా చాటడం ఖాయం. వంద కోట్లతో మరోసారి బాక్సాఫీస్ ను నాగ చైతన్య షేక్ చేయాలని అభిమానులు బలంగా కోరుకుంటున్నారు. ఈ ఫోటోలు చూస్తుంటే బాక్సాఫీస్ ను షేక్ చేసేందుకు చైతూ జిమ్ లో కసరత్తులు చేస్తున్నట్లుగా అనిపిస్తోంది.

# స్పీడ్‌గా ఎన్టీఆర్ డ్రాగన్ షూటింగ్



ఎన్టీఆర్–ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో రూపొందుతున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'డ్రాగన్'. ఇటీవల జోర్డాన్‌లో కీలకమైన షెడ్యూల్‌ను పూర్తి చేసుకున్న చిత్ర యూనిట్, ఇప్పుడు తదుపరి యాక్షన్ వేట కోసం సిద్ధమైంది. జోర్డాన్ షెడ్యూల్‌లో హై–వోల్టేజ్ యాక్షన్ సన్నివేశాలను తెరకెక్కించాడు ప్రశాంత్ నీల్. ఇక ఇప్పుడు నెక్స్ట్ షెడ్యూల్‌లో కూడా భారీ యాక్షన్ ఉండబోతుందని తెలుస్తోంది. కొత్త షెడ్యూల్ ఈ వారంలోనే హైదరాబాద్‌లో ప్రారంభం కానుందని సమాచారం. ఇందుకోసం నగర శివార్లలోని ఒక ప్రముఖ స్టూడియోలో మూడు భారీ సెట్లను నిర్మించారట. ఇందులో విలన్ ఇంటికి సంబంధించిన సెట్ కూడా ఉందట. దాదాపు నెల రోజులకు పైగా సాగే ఈ లాంగ్ షెడ్యూల్‌లో.. సినిమాలోని కీలక సన్నివేశాలను చిత్రీకరించనున్నారట. ఇక ఇక్కడ షూటింగ్ పూర్తయిన వెంటనే, చిత్ర యూనిట్ తదుపరి షెడ్యూల్ కోసం శ్రీలంక వెళ్లేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. అక్కడ కూడా యాక్షనే ఉంటుందని టాక్. మొత్తంగా చూసుకుంటే.. డ్రాగన్ యాక్షన్ షెడ్యూల్సే ఎక్కువగా ఉన్నాయి. ఈ లెక్కన ప్రశాంత్ నీల్ ఏ రేంజ్ యాక్షన్ డోస్ ఇవ్వబోతున్నాడో అర్థం చేసుకోవచ్చు. ఈ సినిమాలో రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటిస్తుండగా, బాలీవుడ్ స్టార్ అనిల్ కపూర్ మరియు మలయాళ నటుడు టోవినో థామస్ కీలక పాత్రల్లో కనిపించబోతున్నారు. 'కె.జి.ఎఫ్', 'సలార్' వంటి బ్లాక్ బస్టర్స్ తర్వాత ప్రశాంత్ నీల్ నుంచి వస్తున్న చిత్రం కావడంతో.. డ్రాగన్ పై అంచనాలు పీక్స్‌లో ఉన్నాయి.

# డిఫరెంట్‌గా దీవానా మూవీ టీజర్




టాలీవుడ్ యువ నటుడు హర్షిత్ రెడ్డి హీరోగా, స్నేహ మణిమేగలై హీరోయిన్‌గా నటిస్తున్న చిత్రం 'దీవాన'. ఈ చిత్ర టీజర్‌ను నేడు విడుదల చేశారు మేకర్స్. టీజర్ ఆరంభం నుంచి ముగింపు వరకు చాలా ఇంటెన్స్‌గా సాగింది. ఒక యువకుడు ప్రేమలో పడి, ఆ ప్రేమ కోసం ఏ స్థాయికైనా వెళ్లే 'దీవాన' గా ఎలా మారాడనేది ఈ చిత్ర ప్రధానాంశం. ముఖ్యంగా ఎంత అందంగా ఉంటే అంత సతాయిస్తారురా పోరీలు' మరియు 'అది నీ ప్రాణం పీక్క తినకపోతే నన్ను అడుగురా' వంటి డైలాగులు యువతను బాగా ఆకట్టుకుంటున్నాయి. తెలంగాణ అర్బన్ నేపథ్యంలో సాగే ఈ స్వచ్ఛమైన మరియు ఇంటెన్స్ లవ్ స్టోరీలో హర్షిత్ రెడ్డి తన నటనతో మరియు డైలాగ్ డెలివరీతో ఆకట్టుకున్నాడు.ఈ సినిమాకు శ్రీకాంత్ సంగిశెట్టి దర్శకత్వం వహించగా.. అర్హ మీడియా, వీ స్టూడియోస్ బ్యానర్స్‌లపై వాసుదేవ్ కొప్పినేని, శ్రీదేవి కార్యంపూడి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. సమ్మర్ కానుకగా ఏప్రిల్ 14న ఈ చిత్రం రాబోతుండగా.. ప్రముఖ నిర్మాణ సంస్థ గీతా ఆర్ట్స్ ఈ మూవీని డిస్ట్రిబ్యూషన్ చేస్తుంది.

# బేబీ పింక్ లెహంగాలో ఆకట్టుకుంటున్న బేబమ్మ..



ప్రస్తుత కాలంలో హీరోయిన్లు ఎక్కువగా సోషల్ మీడియా ఫ్లాట్ ఫామ్ ను ఉపయోగిస్తూ తమ అందాలను ఆరబోస్తూ ఫాలోవర్స్ ను పెంచుకుంటున్నారు. ఒకవైపు హీరోయిన్ గా బిజీగా ఉంటూనే.. మరొకవైపు అభిమానులకు ఎప్పటికప్పుడు చేరువలో ఉండడానికి గ్లామర్ వలకబోస్తూ ప్రత్యేకంగా ఫోటోషూట్ నిర్వహిస్తూ మరీ.. వాటిని షేర్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే తాజాగా మొదటి సినిమాతోనే 100 కోట్ల క్లబ్లో చేరి అందరి దృష్టిని తన వైపు తిప్పుకున్న బేబమ్మ అలియాస్ కృతి శెట్టి గురించి పరిచయాలు ప్రత్యేకంగా అవసరం లేదు.కన్నడ ఇండస్ట్రీకి చెందిన కృతి శెట్టి.. తెలుగులో సుకుమార్ శిష్యుడు బుచ్చిబాబు సనా తొలి ప్రయత్నంలో చేసిన 'ఉప్పెన' సినిమా ద్వారా ఇండస్ట్రీకి పరిచయమైంది. మొదటి సినిమాలో బేబమ్మ క్యారెక్టర్ లో తన పాత్రలో లీనం అయిపోయి అందరి దృష్టిని ఆకట్టుకుంది. ఇందులో మెగా మేనల్లుడు వైష్ణవ్ తేజ్ హీరోగా నటించారు. పైగా దర్శకుడికి, ఈ నటీనటులు ఇద్దరికీ కూడా ఈ సినిమా మొదటి సినిమా కావడం గమనార్హం . మొదటి సినిమానే అయినా అందరి దృష్టిని ఆకట్టుకున్నారు. వంద కోట్ల క్లబ్లో చేరి మెప్పించారు. పైగా ఈ చిత్రానికి బోలెడు అవార్డులు కూడా లభించాయి. ఘాశ్రీంశీ =ఘుఃం – ఎనిమిదేళ్లుగా వేధిస్తున్నారు.. నేనేంటో చూపిస్తా –రష్మిక మందన్న! ఈ సినిమా ఇచ్చిన ఫలితం ఈమెకు వరుసగా అవకాశాలు అందించింది. అలా నానితో కలిసి శ్యామ్ సింగరాయ్, నాగచైతన్య, నాగార్జున కలయికలో వచ్చిన బంగార్రాజు సినిమాలో నాగచైతన్య సరసన నటించి హ్యాట్రిక్ విజయాన్ని సొంతం చేసుకుంది. ఇక తర్వాత ఆ అమ్మాయి గురించి మీకు చెప్పాలి, ది వారియర్, మాచర్ల నియోజకవర్గం, కస్టడీ , మనమే, అన్నగారు వస్తారు ఇలా పలు చిత్రాలు చేసింది. కానీ ఏవి కూడా మంచి విజయాన్ని అందించలేదు. కానీ ఇప్పుడు కోలీవుడ్లో బిజీ అయిపోయిన ఈమె.. మరొకవైపు అభిమానులను ఆకట్టుకోవడానికి మీడియాలో బిజీగా మారిపోయింది.

# అక్షయ్ కుమార్ భూత్ బంగ్లా టీజర్ విడుదల




బాలీవుడ్ స్టార్ అక్షయ్ కుమార్, దర్శకుడు ప్రియదర్శన్ కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవైటెడ్ హారర్–కామెడీ చిత్రం 'భూత్ బంగ్లా'. సుమారు 14 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత వీరిద్దరి కాంబోలో ఈ సినిమా వస్తుండటంతో భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే తాజాగా ఈ చిత్రం నుంచి టీజర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. గతంలో వీరిద్దరి కలయికలో వచ్చిన 'భూల్ భులైయా' వంటి క్లాసిక్ సినిమాను గుర్తు చేస్తూ, భయం మరియు నవ్వుల మేళవింపుతో ఈ టీజర్ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. మంగళపూర్ అనే గ్రామంలోని 'వధుసురుడు' అనే మిస్టరీ చుట్టూ ఈ సినిమా కథ తిరుగుతుందని టీజర్ ద్వారా చిత్ర బృందం స్పష్టం చేసింది. ఈ చిత్రంలో అక్షయ్ కుమార్‌తో పాటు టబు, పరేష్ రావల్, రాజ్‌పాల్ యాదవ్, వామిఖ గబ్బి, మిథిలా పాల్కర్ వంటి భారీ తారాగణం నటిస్తుండగా, ప్రీతమ్ అద్భుతమైన సంగీతాన్ని అందించారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని రామోజీ ఫిలిం సిటీలో కీలక సన్నివేశాల చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఏప్రిల్ 10న వరల్డ్ వైడ్‌గా విడుదల కాబోతుంది.

# ఉస్తాద్ ప్రచారంలో బిజీగా హరీష్ శంకర్

ప్రస్తుతం హరీశ్ శంకర్ 'ఉస్తాద్ భగత్ సింగ్' కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. పవన్ కల్యాణ్ హీరోగా తెరకెక్కిన ఈ చిత్రం మార్చి 19న భారీస్థాయిలో విడుదలకు సిద్ధమవుతోంది. దీనిప్రచారంలో భాగంగా దర్శకుడు వరుస ఇంటర్వ్యూలతో బిజీగా ఉన్నారు. తాజాగా ఆయన మాట్లాడుతూ ఈ సినిమా ప్రీలుక్ పోస్టర్ విడుదలైనప్పుడు వచ్చిన రూమర్స్‌పై స్పందించారు. ప్రీలుక్ పోస్టర్‌లో హీరో వెనక నుంచి తీసిన ఫొటో ఉండటంతో అందులో ఉన్నది పవన్ కల్యాణ్ కాదు, హరీశ్ శంకరే స్వయంగా డూప్‌గా నటించారనే వార్తలు వైరల్ అయ్యాయి. టీజర్ విడుదలైన తర్వాత కూడా కొందరు ప్రేక్షకులు ఆయనే డూప్‌గా నటించారని అన్నారు. దీనిపై ఆయన మాట్లాడుతూ.. తాను పవన్ కల్యాణ్‌కు ఎప్పుడూ డూప్‌గా నటించలేదని స్పష్టం చేశారు. ఆ రూమర్లు చూసి తాను బాధ పడలేదని, పవన్‌తో తనను పోల్చడం, తాను ఒక స్టార్ హీరోలా కనిపిస్తున్నానని జనం అనుకోవడం తనకు సంతోషాన్నిచ్చిందని సరదాగా అన్నారు.చిత్ర పరిశ్రమలో బాడీ డూప్‌ను ఎందుకు ఉపయోగిస్తారనే విషయంపై కూడా హరీశ్ శంకర్ వివరణ ఇచ్చారు. షూటింగ్ సమయంలో హీరోలకు చిన్న గాయం తగిలినా షూటింగ్ షెడ్యూల్స్ మొత్తం అస్తవ్యస్తమవుతాయని, దీనివల్ల నిర్మాతలకు కోట్ల రూపాయల నష్టం వస్తుందని ఆయన తెలిపారు. అందుకే హీరోల భద్రతను దృష్టిలోఉంచుకుని, రిస్క్ ఎక్కువగా ఉండే సన్నివేశాల్లోనే డూప్స్‌ను వాడతారని ఆయన వివరించారు.

